



Truth of News
RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 117 | గురువారం 2 అక్టోబర్ 2025 | పేజీలు : 08 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

## పేదవాళ్ల కోసం.. అన్న క్యాంటీన్లు పెంచుతాం

### - ఏపి సిఎం చంద్రబాబు నాయుడు



**అమరావతి- సూర్య వాస్తవం, అక్టోబర్ 1:** పేదవాళ్ల కోసం అన్న క్యాంటీన్లు ఇంకా పెంచుతామని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. విశాఖ ఐటి హబ్ గా మారబోతుందని అన్నారు. విజయనగరం జిల్లా దత్తి గ్రామంలో సామాజిక పింఛన్ల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పేదల సేవలో ప్రజావేదిక సభలో సిఎం మాట్లాడుతూ.. ఉత్తరాంధ్రలో రూ. 2 వేల కోట్లు ఖర్చుపెట్టి వందశాతం అన్ని ప్రాజెక్టులు పూర్తి చేస్తున్నామని, విశాఖ స్టీల్ ప్లాంట్ కాపాడామని రూ.11,400 కోట్లు ఇప్పించామని తెలియజేశారు. ప్రపంచస్థాయి కంపెనీలు విశాఖకు తరలివస్తాయని, 10, 579 మందికి వితంతు పింఛన్లు ఇచ్చామని చెప్పారు. ప్రతి నెలా ఒకటినే పింఛన్ల పండుగ చేసుకుంటున్నామని, ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని ఆనందాన్ని వ్యక్తం చేశారు. 63 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నామని అన్నారు. ఈ 16 నెలల్లో పేదలకు రూ. 48,019 కోట్లు ఇచ్చామని చెప్పారు. గతంలో ఒక నెల తీసుకోకపోతే ఇచ్చేవాళ్లు కాదని.. ఇప్పుడు తర్వాత నెలలో కూడా తీసుకోవచ్చునని తెలిపారు. పింఛన్ల పంపిణీ సమయంలో ఎక్కడ ఉంటే అక్కడ తీసుకునే అవకాశం ఇస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు అందిస్తున్నామని చెప్పారు. పింఛన్ సొమ్మును పది రెట్లు పెంచిన ఘనత టిడిపిది అని కొనియాడారు. మహిళలను అన్ని రంగాల్లో పైకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని, సూపర్ సిక్స్ ను సూపర్ హిట్ చేశామని చంద్రబాబు పేర్కొన్నారు. ఎంతమంది పిల్లలున్నా తల్లికి వందనం ఇస్తున్నామని, మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని అన్నారు. ప్రతినె లా ఒక గ్రామానికి నేరుగా వచ్చి తానే పర్యవేక్షిస్తున్నానని, 2 కోట్ల 66 లక్షల గ్యాస్ సిలిండర్లు ఇచ్చామని, రూ. 1,718 కోట్లు ఖర్చు పెట్టామని చెప్పారు. ఆడబిడ్డల కోసం ఆగష్టు 15న స్త్రీశక్తి పథకం తీసుకొచ్చామని, ఒకప్పుడు పది లక్షల మందే బస్సులు ఎక్కేవారని.. ఇప్పుడు డబుల్ అయిందని ప్రశంసించారు. ఆడబిడ్డలు ఆర్థికంగా ఎదగాలన్నదే తమ ఉద్దేశం అని చంద్రబాబు స్పష్టం చేశారు.

కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు అస్వస్థత..

## ఆస్పత్రికి తరలింపు



**హైదరాబాద్-సూర్య వాస్తవం, అక్టోబర్ 1:** అఖిల భారత కాంగ్రెస్ కమిటీ, భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అస్వస్థత కు గురయ్యారు. వెంటనే ఆయనను ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆయన పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తూ చికిత్స ప్రారంభించారు. వర్గాల సమాచారం ప్రకారం, మంగళవారం రాత్రి ఖర్గేకు నిరంతర జ్వరం రావడంతో బెంగళూరులోని ప్రఖ్యాత ఎంఎస్ రామయ్య ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతానికి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు పేర్కొన్నారు. ఖర్గే ఆస్పత్రిలో చేరిన వార్త దేశవ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలు, మద్దతుదారులలో ఆందోళనను రేకెత్తించింది. ఆయన త్వరగా కోలుకోవాలని పార్టీ సీనియర్ నాయకులు ఆకాంక్షిస్తున్నారు. 83 ఏళ్ల మల్లికార్జున్ ఖర్గే సీనియర్ పార్లమెంటేరియన్, కాంగ్రెస్ పార్టీలోని అత్యంత ప్రముఖ నాయకులలో ఒకరు.

## స్థానిక సమరానికి పార్టీలు రెడీ




**హైదరాబాద్- సూర్య వాస్తవం, అక్టోబర్ 1:** స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో గ్రామాల్లో రాజకీయాలు వేడె క్కాయి. పల్లె ల్లో పట్టు సాధించుకునేందుకు రాజకీయ పార్టీలు తమ వ్యూహాలకు పదును పెడుతు న్నాయి. మెజార్టీ సీట్లు సాధించుకోవడమే లక్ష్యంగా ఎత్తుగడలతో ముందుకు సాగను న్నాయి. మొదటగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, ఆ తర్వాత సర్పంచ్ ఎన్నికలు జరగనుండటంతో నెలన్నర పాటు గ్రామాల్లో ఎన్నికల వాతావరణం కనిపించనుంది.

- మిగతా 2లో..

## కవిత రాజీనామా ఆమోదానికి బ్రేక్



**హైదరాబాద్- సూర్య వాస్తవం, అక్టోబరు 1:** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. నిజామాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా కల్వకుంట్ల కవిత ఎన్నికయ్యారు. 2021లో ఆమె నిజామాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా గెలిచారు. నాడు బీఆర్ఎస్ అధికారంలో ఉండటంతో నిజామాబాద్ పరిధిలోని స్థానిక సంస్థలలో ఎక్కువ భాగం బీఆర్ఎస్ చేతిలోనే ఉండేవి. అలాగే ఎమ్మెల్యేలు కూడా ఎక్కువ సంఖ్యలో నాడు నిజామాబాద్ జిల్లాలో ఉన్నారు. దీంతో నిజామాబాద్ జిల్లా నుంచి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా కల్వకుంట్ల కవిత సులువుగా ఎన్నికయ్యారు. పెద్దల సభలోకి అడుగు పెట్టారు. అయితే ఆమె ఇటీవల బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి తాను రాజీనామా చేస్తున్నట్లు కల్వకుంట్ల కవిత ప్రకటించారు.

- మిగతా 2లో..

## పెట్టుబడుల కోసం పరుగో.. పరుగు



**విశాఖపట్టణం- సూర్య వాస్తవం, అక్టోబరు 1:** విశాఖలో అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సు జరగనుంది. ప్రతిష్టాత్మకంగా నిర్వహించి ఏపీకి పెట్టుబడులు తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఇప్పటికే సీఎం చంద్రబాబు, నారా లోకేష్ బృందం సింగపూర్లో పర్యటించింది. అక్కడి పారిశ్రామికవేత్తలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించింది. అయితే తాజాగా విశాఖలో పెట్టుబడుల సదస్సుకు సంబంధించి ఢిల్లీ పర్యటనకు వెళ్తున్నారు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్. మధ్యాహ్నంకి ఢిల్లీ చేరుకొని.. ఢిల్లీలో భారత పరిశ్రమల సమాఖ్య ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. ఐటిసి మౌర్యలో జరిగే సిఐఐ పార్ట్నర్షిప్ సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. అక్కడే పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక విజ్ఞప్తి చేస్తారు.

- మిగతా 2లో..

## మండలిలో బలం కోసం కసరత్తు




**విజయవాడ- సూర్య వాస్తవం, అక్టోబరు 1:** ఏపీలో రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలాన్ని కూడా తీసుకొని గట్టిగానే పోరాడుతోంది. ఏపీ శాసనసభలో ఆ పార్టీకి సంఖ్యా బలం తక్కువ. కానీ శాసనమండలి వేదికగా ప్రభుత్వ నిర్ణయాలను తప్పుపడుతోంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పావులు కదుపుతోంది. ముఖ్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లులను అడ్డుకుంటుంది. ఈ క్రమంలో తాజాగా రాజకీయ హింసలో బలైన ఓ వ్యక్తి కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలనుకున్న కూటమి ప్రభుత్వానికి శాసనమండలిలో చుక్కెదురు అయ్యింది. ఆ బిల్లును శాసనమండలిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంది. ఈ క్రమంలోనే కూటమి పునరాలోచనలో పడింది. 2019లో వైసీపీఅధికారంలోకి వచ్చిన తర్వాత ఇదే పరిస్థితి ఎదురయింది. శాసనసభలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన బలం ఉంది. కానీ శాసనమండలిలో మాత్రం తెలుగుదేశం పార్టీ హవా కొనసాగింది. ఈ క్రమంలో మూడు రాజధానులకు సంబంధించిన బిల్లు శాసనమండలిలో ఆమోదానికి నోచుకోలేదు.

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## ఫిలిప్పీన్స్‌లో భారీ భూకంపం

### - 31 మంది మృతి



**మనీలా-సూర్య వాస్తవం, అక్టోబర్ 1:** ఫిలిప్పీన్స్‌లో భారీ భూకంపం సంభవించింది. దీంతో తీవ్ర ప్రాణనష్టం, ఆస్థి నష్టం జరిగింది. మంగళవారం అర్ధరాత్రి ఫిలిప్పీన్స్‌లో రిక్టర్ స్కేలుపై 6.9 తీవ్రతతో భూ ప్రకంపనలు సంభవించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ భూ ప్రకంపనలతో దాదాపు 31మందికి పైగా మరణించగా.. అనేక

- మిగతా 2లో..

## వినియోగదారులకు షాక్

### - గ్యాస్ సిలిండర్ ధర పెంపు



**న్యూఢిల్లీ-సూర్య వాస్తవం, అక్టోబర్ 1:** దసరా పండగ ముందు వాణిజ్య గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు చమురు మార్కెటింగ్ కంపెనీలు షాకిచ్చాయి. బుధవారం గ్యాస్ సిలిండర్ ధరలు పెంచుతున్నట్లు ప్రకటించాయి. 19 కిలోల వాణిజ్య ఒఖఉ సిలిండర్ ధరపై రూ.15.50 పెంచారు. దీంతో దేశ రాజధాని ఢిల్లీలో 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధర ఇప్పుడు రూ.1,595.50కి చేరుకుంది.

- మిగతా 2లో..

# ఫిలిప్పీన్స్‌లో భారీ భూకంపం

మొదటి పేజీ తరువాయి

మంది గాయపడినట్లు తెలిపారు. అలాగే పలు భవనాలు, ఇళ్లు ధ్వంసమయ్యాయి. భూప్రకంపనలతో తీవ్ర భయాందోళనలతో ప్రజలు ఇళ్ళ నుండి బయటకు పరుగులు పెట్టారు. తీవ్రమైన ప్రకంపనల కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని అధికారులు తెలిపారు. ఫిబ్రవరి నుంచి లక్ష డాలర్ల ఫీజు సెబు ప్రావిన్స్‌లోని బోగోకు ఈశాన్యంగా 17 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఏర్పడినట్లు అధికారులు తెలిపారు. దాదాపు 90,000 మంది జనాభా నివసించే ఈ తీరప్రాంత నగరంలో 14 మంది మృతి చెందినట్లు విపత్తు-ఉపశమన అధికారి రెక్స్ వైగోట్ అసోసియేటెడ్ చెప్పారు. బోగోలో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. భారీ భూ ప్రకంపనలు కారణంగా పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటంతో కొంతమంది మరణించగా.. మరికొంతమంది గాయపడినట్లు అధికారులు చెప్పారు. గాయపడిన వారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం సంఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

# వినియోగదారులకు షాక్

మొదటి పేజీ తరువాయి

పెరిగిన ధరలు ఇవాల్టి నుంచే అమలులోకి వస్తాయని తెలిపాయి. దీంతో హోటళ్ళు, రెస్టారెంట్లు, వాణిజ్య వంట గ్యాస్‌పై ఎక్కువగా ఆధారపడే పలు వ్యాపారాలపై ప్రభావం పడనుంది. ఇక, గృహ సిలిండర్ల ధరల్లో ఎలాంటి మార్పు లేదు. వాణిజ్య రేట్లలో పెరుగుదల సర్దుబాటు ఉన్నప్పటికీ 14.2 కిలోల దేశీయ ఒఖఉ సిలిండర్ల ధరలు ప్రస్తుతానికి స్థిరంగా ఉన్నాయి.

# మండలిలో బలం కోసం కసరత్తు

మొదటి పేజీ తరువాయి

టిడిపి ఎమ్మెల్సీలు అడ్డుకోవడంతో ఆ పరిస్థితి ఎదురయింది. దీనిని తీవ్ర అవమానంగా భావించారు అప్పటి సీఎం జగన్మోహన్ రెడ్డి. ఏకంగా శాసనమండలి రద్దుకు శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించారు. కేంద్ర ప్రభుత్వం వద్ద ఆ నిర్ణయం పెండింగ్లో ఉండిపోయింది. అయితే ఇప్పుడు అదే పరిస్థితి టిడిపి కూటమికి ఎదురు కావడంతో.. ఏం చేయాలన్న ఆలోచనలో ఉంది కూటమి ప్రభుత్వం.అయితే తాజాగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ ఏసురత్నం కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయ హింసలో చనిపోయిన వ్యక్తి కుమారుడికి ఉద్యోగం ఇవ్వడంలో తప్పు లేదని వ్యాఖ్యానించారు. దీంతో ఆయన విషయంలో చర్చ ప్రారంభం అయ్యింది. ఆయన పార్టీ మారే ఉద్దేశంతో ఉన్నారని ప్రచారం జరుగుతోంది. ఎప్పుడైతే బిల్లుకు వ్యతిరేకంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పావులు కదిపిందో.. అప్పుడే టిడిపి కూటమి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీలను ఆకర్షించే ప్రయత్నం చేసిందని టాక్ వినిపిస్తోంది. ఈ క్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ ఏసురత్నం ఈ తరహా వ్యాఖ్యలు చేయడం హాట్ టాపిక్ అవుతోంది. ఏసు రత్నం పోలీస్ శాఖలో పనిచేసేవారు. వడ్డెర కులానికి చెందిన ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి 2019లో పోటీ చేశారు. ఓటమి చవి చూడడంతో జగన్మోహన్ రెడ్డి ఆయనకు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారు. అయితే తాజాగా మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో.. ఆయన మనసు మారినట్లు సమాచారం.వచ్చే శాసనసభ సమావేశాల నాటికి శాసనమండలిలో టిడిపి కూటమికి స్పష్టమైన ఆధిక్యత లభించేలా పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఏడుగురు ఎమ్మెల్సీలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. మరికొందరు పదవీ విరమణ చేశారు. ఇంకొందరు కూటమితో టచ్ లో ఉన్నారు. దీంతో ఓ నలుగురు ఎమ్మెల్సీలను ఇటు వైపు లాక్కుంటే.. తప్పకుండా శాసనమండలి కూటమి చేతిలోకి రావడం ఖాయం. అయితే తాజాగా వైసీపీ ఎమ్మెల్సీ ఏసురత్నం వ్యాఖ్యలతో ఒకరు ఖాయమని తెలుస్తోంది. మిగతా ముగ్గురు ఎవరన్నది తేలాల్సి ఉంది.

# రెండో దశ నీట్ సీట్ల కేటాయింపు జాబితా విడుదల

**హైదరాబాద్- సూర్య వాస్తవం అక్టోబరు 1:** తెలంగాణలో రెండో దశ ఎంబీబీఎస్, బీడీఎస్‌లో ప్రవేశాల కోసం ఎదురు చూస్తున్న వాళ్లకు గుడ్ న్యూస్. ఇప్పటికే తమకు కావాల్సిన కాలేజీలో సీట్లను ఎంపిక చేసుకున్న విద్యార్థులు వాటి




ఫలితాల కోసం ఎంతగానో ఎదురు చూస్తున్నారు. వారి ఎదురు చూపులకు తగ్గట్టుగానే కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఆ రెండో దశ సీట్ల కేటాయింపు వివరాలను వెబ్‌సైట్‌లో పెట్టింది. రెండో దశలో ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల కేటాయింపునకు సంబంధించిన వివరాలు తెలుసుకునేందుకు విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్‌లోకి లాగిన్ అవ్వాల్సిన పని లేదు. నేరుగా అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి సెకండ్ ఫేజ్ సీట్ల కేటాయింపు వివరాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పీడీఎఫ్ ఉన్న వివరాల్లో మీ పేరు మీకు కేటాయించిన కాలేజీ వివరాలను చెక్ చేసుకోవచ్చు. డౌన్‌లోడ్ చేసిన సెకండ్ ఫేజ్ ఎంబీబీఎస్, బీడీఎస్ జాబితా పీడీఎఫ్‌లో ర్యాంకులు, రోల్ నెంబర్ వారిగా కేటాయించిన కాలేజీల వివరాలు ఇచ్చారు. అందులో మీరు మీ మెరిట్ ఆధారంగా సాధించిన కాలేజీ గురించి చూడొచ్చు. ఇందులో ర్యాంకు, కేటగిరి, రిజర్వేషన్లు ఇతర ప్రాధాన్యతల ఆధారంగా కేటాయింపులు జరిగాయి. వాటిని చెక్ చేయవచ్చు. మీ పేరుకు ఎదురుగా అన్ని వివరాలు పొందుపరిచారు. మీరు డౌన్‌లౌడ్ చేసిన రెండో దశ ఎంబీబీఎస్, బీడీఎస్, పీడీఎఫ్‌ను ప్రింట్ తీసి పెట్టుకోవాలి. ఇందులో మీకు కేటాయించిన కాలేజీ నచ్చినట్టు అయితే తర్వాత ప్రక్రియ పూర్తి చేయాలి. ఆ కాలేజీకి వెళ్లి ఫీజు చెల్లించి మిగతా వివరాలు అందజేయాలి. అప్పుడే మీకు కేటాయించిన సీటు మీకు కన్ఫామ్ అవుతుంది. లేకుంటే గడువు లోపు ఈ పని పూర్తి చేయకుంటే మాత్రం సీట్లు క్యాన్సిల్ అయ్యే అవకాశం ఉంటుంది. మీరు నీట్ అప్లికేషన్ నింపేటప్పుడు ఇచ్చిన మెయిల్, ఫోన్ నెంబర్‌కి కూడా వివరాలు పంపించారు. ఒక్కసారి చెక్ చేసుకోండి. కొన్ని సార్లు మెయిల్‌లో వివరాలు స్పామ్‌లోకి వెళ్లి ఉంటాయి. అందులో కూడా చెక్ చేయాల్సిన అవసరం ఉంది. మీకు కేటాయించిన కాలేజీ పేరుతో మీకు అలాట్మెంట్ లెటర్ వచ్చి ఉంటుంది. దాన్ని డౌన్‌లోడ్ చేయాలి అంటే కచ్చితంగా అధికారిక వెబ్‌సైట్‌లోకి లాగిన్ కావాలి. అప్పుడే దాన్నిడౌన్ లోడ్ చేసుకోగలరు. కాలేజీకి వెళ్లినప్పుడు కచ్చితంగా ఇది ఇస్తేనే మీరు తర్వాత ప్రక్రియ పూర్తి చేయడానికి వీలవుతుంది. డౌన్‌లౌడ్ చేసిన తర్వాత ఎంబీబీఎస్ అభ్యర్థులు నలభై వేలు, బీడీఎస్ అభ్యర్థులు ఇరవై వేలు చెల్లించాలి. అలా చెల్లించిన తర్వాత మీ సీటును హోల్డ్ చేస్తారు. ఒక తేదీని మీకు ఇస్తారు. ఆ తేదీ లోపు మీరు కాలేజీకి వెళ్లి మిగతా ప్రక్రియ పూర్తి చేయాలి. ఆన్‌లైన్‌లో వివరాలు అందివ్వకుండా కూడా కాలేజీకి వెళ్లినా ప్రయోజనం ఉండదు. ఈ రెండింటిలో ఏది చేయకున్నా సరే మీ సీటును రద్దు చేస్తారు. తర్వాత విడత కౌన్సెలింగ్స్‌లో ఆ సీటును ఉంచుతారు. అందుకే కచ్చితంగా ఆన్‌లైన్ ఆఫ్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలి. నచ్చిన సీటు రాని వాళు తర్వాత విడత కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చు.

# పెట్టుబడుల కోసం పరుగో.. పరుగు

మొదటి పేజీ తరువాయి

సీఐఐ ఆధ్వర్యంలో విశాఖలో జరగనున్న పెట్టుబడుల సదస్సుకు తరలిరావాలని కోరనున్నారు.విశాఖ పెట్టుబడుల సదస్సును ఏపీ ప్రభుత్వంప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. ముందుగానే సన్నాహాలు ప్రారంభించింది. ఇప్పటికే సీఎం చంద్రబాబు బృందం సింగపూర్ లో పర్యటించి అక్కడి పారిశ్రామికవేత్తలతో సమావేశం అయింది. విశాఖలో జరిగే పెట్టుబడుల సదస్సుకు వస్తే ఏపీ ప్రభుత్వం అన్ని విధాల ప్రోత్సాహాలు అందిస్తామని చెప్పారు సీఎం చంద్రబాబు. అంతకుముందు లండన్ లో పర్యటించారు నారా లోకేష్. అలాగే దావోస్ పర్యటనకు కూడా వెళ్లారు. ఆ సమయంలో కూడా దిగ్గజ పారిశ్రామికవేత్తలతో సమావేశం అయ్యారు. వారితో ప్రత్యేక రోడ్డు షో నిర్వహించారు. వాటి ఫలితాలు ఇప్పుడిప్పుడే కనిపిస్తున్నాయి. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి. విశాఖ సదస్సుతో భారీగా పెట్టుబడులు తేవాలన్నది ప్రభుత్వ ప్రణాళికగా తెలుస్తోంది.మరోవైపు ఏపీ మంత్రుల బృందం దక్షిణ కొరియాలో పర్యటించింది. విశాఖలో నిర్వహించనున్న పారిశ్రామిక పెట్టుబడుల సదస్సుకు తరలి రావాలని అక్కడి ప్రతినిధులను కోరారు మంత్రులు. మంత్రులు నారాయణ, బీసీ జనార్దన్ రెడ్డి తో పాటు సీనియర్ అధికారులు ఈ బృందంలో ఉన్నారు. దక్షిణ కొరియా రాజధాని సియోల్ లో ఎల్జి కంపెనీ ప్రతినిధులతో మంత్రుల బృందం సమావేశం అయింది. మరోవైపు విద్యుత్తు వస్తువుల తయారీకి సంబంధించి ఎల్ ఎస్ గ్రూప్ కంపెనీ ప్రతినిధులతో కూడా సమావేశం అయింది. మెడికల్, స్మార్ట్ సూట్ తయారీలో అగ్రగామిగా ఉన్న సు ఆల్ సంస్థ చైర్మన్ చివోంగు లీతో కూడా సమావేశం అయ్యింది మంత్రుల బృందం. వారంతా విశాఖ పెట్టుబడుల సదస్సుకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు మంత్రుల బృందం చెబుతోంది. మొత్తానికైతే విశాఖలో పెట్టుబడుల సదస్సును ప్రతిష్టాత్మకంగా తీసుకుంది ఏపీ ప్రభుత్వం. సీఎం చంద్రబాబు తో పాటు మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. మరి ఈ పెట్టుబడుల సదస్సులో ఏ స్థాయిలో.. పరిశ్రమలు ఏర్పాటుకు దిగ్గజ పారిశ్రామికవేత్తలు ముందుకొస్తారో చూడాలి.

**క్వాంటం కంప్యూటింగ్ అంతా రెడీ**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు .. రాష్ట్ర వృద్ధి లక్ష్యాలను, పెట్టుబడుల ఆకర్షణ విధానాలను ఢిల్లీ వేదికగా జరిగిన సదస్సులో పారిశ్రామిక లోకానికి వివరించారు. ఢిల్లీలో జరిగిన కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ పార్ట్నర్‌షిప్ సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు.. ఏపీలో ఉన్న పెట్టుబడి అవకాశాలను వెల్లడించారు. ఈ సందర్భంగా సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్ డాక్యుమెంటరీని సీఎం చంద్రబాబు ఆవిష్కరించిన తర్వాత మాట్లాడారు. ఆదాయాన్ని సృష్టించడం ద్వారానే ప్రజలకు మెరుగైన సేవలను అందించగలమని పేర్కొన్న చంద్రబాబు.. తద్వారా పేదరికాన్ని సమూలంగా నిర్మూలించగలమని స్పష్టం చేశారు. 2024-2025 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ 8.25 శాతం వృద్ధిరేటును సాధించిందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 15 నెలల్లోనే పలు కీలక విధానాలను తీసుకువచ్చిందని వెల్లడించారు. సులభతర వాణిజ్యం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని తేల్చి చెప్పారు. ఏపీ ఇప్పుడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు మారినట్లు స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏడోసారి సీఐఐ భాగస్వామ్య సదస్సు నిర్వహించబోతున్నట్లు తెలిపిన చంద్రబాబు.. రాష్ట్రాలను ప్రమోట్ చేయడానికి, పెట్టుబడులను ఆకర్షించడానికి సీఐఐ ఒక శక్తిమంతమైన వేదిక అని వెల్లడించారు.భారత్ నుంచి దావోస్ వెళ్తున్న నాయకుల్లో తాను ముందుంటానని.. సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రపంచ పారిశ్రామికవేత్తలతో తాము సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. రాష్ట్రాల భాగస్వామ్యం లేకుండా భారత దేశ వృద్ధి సంపూర్ణం కాదని ఈ సందర్భంగా చంద్రబాబు తేల్చి చెప్పారు. స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 నినాదంతో తాము ముందుకెళు తున్నామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని 2.47 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ లక్ష్య సాధన కోసం 10 నిర్దిష్ట విధానాలను అనుసరిస్తున్నామని చెప్పారు.ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ప్రైవేటు వ్యక్తుల భాగస్వామ్యంతో కూడిన సమ్మిళిత వృద్ధిరేటు (పీ4 విధానాన్ని) విధానం అమలు చేస్తున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. వెయ్యి కిలోమీటర్ల తీర ప్రాంతం ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న అతిపెద్ద బలమని.. రాష్ట్రంలో ప్రతి 50 కిలోమీటర్లకు ఒక పోర్టు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. మరిన్ని ఎయిర్‌పోర్టులు నిర్మించాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఏపీని ఉత్తమమైన లాజిస్టిక్స్‌కు కేంద్రంగా మార్చే యోచనలో ఉన్నట్లు వెల్లడించారు. స్పేస్ సిటీ, ఎలక్ట్రానిక్ సిటీ, డ్రోన్ సిటీ, ఏరో స్పేస్ సిటీ ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. జనవరి నాటికి అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ ఏర్పాటు చేస్తామని.. 2 ఏళ్లలో రాష్ట్రంలోనే క్వాంటం కంప్యూటర్ల తయారీని చేపడతామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# కవిత రాజీనామా ఆమోదానికి బ్రేక్

మొదటి పేజీ తరువాయి

కవిత పదవీకాలం మరో రెండేళ్ల సయం ఉంది. స్పీకర్ ఫార్మాట్ లోనే రాజీనామా ఆమోదించినప్పటికీ కల్వకుంట్ల కవిత రాజీనామా మాత్రం ఆమోదం పొందలేదు. అలాగే పార్టీ పరంగా వచ్చిన ఎమ్మెల్సీ పదవికి కూడా తాను రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. బీఆర్ఎస్ తనను సస్పెండ్ చేయడంతో తనకు పార్టీ పరంగా వచ్చిన పదవులను కూడా వదులు కున్నారు. అయితే ఇంత వరకూ ఆమె రాజీనామా మాత్రం ఆమోదం పొందలేదు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఇప్పటికే కల్వకుంట్ల కవితతో ఫోన్ లో మాట్లాడి ఆవేశంతో నిర్ణయం తీసుకోవద్దని, ఆలోచించి రాజీనామాపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు. అయితే తాను ఆలోచించి ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసినట్లు కల్వకుంట్ల కవిత చెప్పారని తెలిసింది. అయితే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ రాజీనామాను మాత్రం శాసనమండలి చైర్మన్ ఇప్పటి వరకూ ఆమోదించలేదు.తాజాగా స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ విడుదలయింది. ఈ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను సాధించిన తర్వాత మాత్రమే ఆమె రాజీనామా ఆమోదం పొందుతుందన్న కామెంట్స్ బీఆర్ఎస్ నేతలే అంటున్నారు. ఇప్పుడు రాజీనామా ఆమోదించినా స్థానిక సంస్థలలో బీఆర్ఎస్ బలంగా ఉందని, అందుకే లోకల్ బాడీస్ ఎన్నికల తర్వాత కవిత రాజీనామా ఆమోదించే అవకాశముందని చెబుతున్నారు. మరొకవైపు పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సొంత జిల్లా కావడంతో ఈ ఎమ్మెల్సీ స్థానానికి బాగా ప్రాధాన్యత ఏర్పడింది. సెప్టెంబర్ 3వ తేదీన కల్వకుంట్ల కవిత రాజీనామా చేసినప్పటికీ ఇప్పటి వరకూ ఆమోదించలేదన్నది బీఆర్ఎస్ వర్గాల వాదన. మొత్తం మీద స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో ఇక ఫలితాల తర్వాత మాత్రమే రాజీనామా ఆమోదం పొందే అవకాశముందని అంటున్నారు. కవిత కూడా ఇదే రకమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు

**లండన్‌లో సంచలన వ్యాఖ్యలు**

భారత రాష్ట్ర సమితి బహిష్కృత నేత.. జాగృతి అధినాయకురాలు కలవకుండా కవిత ప్రస్తుతం లండన్ లో ఉన్నారు. బతుకమ్మ సంబరాలలో పాల్గొంటున్నారు. ఇటీవల కాలంలో ఆమె తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో కేంద్ర బిందువుగా మారారు. రోజుకో తీరుగా సంచలన వ్యాఖ్యలు చేస్తూ తెలంగాణ రాజకీయాలను షేక్ చేస్తున్నారు.లండన్ లో జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కల్వకుంట్ల కవిత.. ఒకసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజలు కోరుకుంటే తాను పార్టీ పెడతానని స్పష్టం చేశారు. పార్టీ ఏర్పాటు విషయంలో తనకంటూ కొన్ని లక్ష్యాలు ఉన్నాయని కవిత వ్యాఖ్యానించారు. ఎన్నికలకు ఇంకా సమయం ఉంది కాబట్టి పార్టీ ఏర్పాటు విషయంలో ఆమె ఆచితూచి నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే కొంతమంది నేతలతో ఆమె సమాలోచనలు జరిపారు. ఇటీవల కాలంలో కూడా తన నివాసంలో ముఖ్య కార్యకర్తలతో ఆమె వరుసగా సమావేశాలు కూడా నిర్వహించారు. ఆ సమావేశాలలో ఆమె రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తారని ప్రచారం జరిగినప్పటికీ.. అది కార్యరూపం దాల్చలేదు.

భారత రాష్ట్ర సమితిపై కూడా కల్వకుంట్ల కవిత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 20 సంవత్సరాల పాటు తాను భారత రాష్ట్ర సమితిలో ఉన్నానని.. పార్టీ ఎదుగుదల కోసం తన కృషి చేశానని.. ఇప్పుడు ఆ పార్టీ నుంచి సస్పెండ్ చేశారని కవిత వ్యాఖ్యానించారు. భారతీయ జనతా పార్టీ డిఎన్ఏ తనకు సరిపడదని.. కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లే ఉద్దేశం లేదని.. రాజకీయ కార్య క్షేత్రాన్ని ప్రజలు కోరుకున్న విధంగా ఏర్పాటు చేస్తానని కవిత పేర్కొన్నారు. కల్వకుంట్ల కవిత రాజకీయ పార్టీ పెడతారని మొన్నటి దాకా ప్రచారం జరిగిన నేపథ్యంలో.. కవితే నేరుగా స్పష్టం చేయడంతో.. ఇప్పట్లో ఆమె పార్టీ పెట్టే అవకాశాలు లేవని తెలుస్తోంది. ఏది ఏమైనప్పటికీ సంచలన వ్యాఖ్యలతో మరోసారి కల్వకుంట్ల కవిత తెలంగాణ రాజకీయాలలో సంచలనంగా మారారు.

# స్థానిక సమరానికి పార్టీలు రెడీ

మొదటి పేజీ తరువాయి

ఆ తర్వాత మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు కూడా నిర్వహించే అవకాశం ఉంది. దీంతో రాజకీయ పార్టీలన్నీ విమర్శలు, ప్రతి విమర్శల కు కత్తులునూరుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీకి కొంత మేర కలసివస్తాయి. చేసిన అభివృద్ధి, సంక్షేమంతో పాటు భవిష్యత్‌లో చేయాల్సిన పనులు చెప్పుకోవడానికి అధికార పక్షానికి అవకాశం ఉం టుంది. ఇక ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వ వైఫల్యాలు, అమలుకాని ఎన్నికల హామీలపై ప్ర భుత్వాన్ని ప్రశ్నిస్తూ ఇరుకునపెట్టే ప్రయత్నం చేస్తుంటాయి. అధికార కాంగ్రెస్ పార్టీ, స్థానిక ఎన్నికల్లో విజయం సాధించేందుకు పటిష్టమైన ప్రణాళికలు రచిస్తున్నది. ఒక వైపు పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతానికి చర్యలు తీసుకుంటూనే మరో వైపు బీఆర్ఎస్, బీజేపీపై న విమర్శల జోరు పెంచు తోంది. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కాళేశ్వరం, ఫార్ములా ఈ కారు రేసులో అవినీతి జరిగింద ని, విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. బీఆర్ఎస్ హయాంలో రూ. లక్ష కోట్లకు పైగా అవినీతి జరిగిందని విమర్శలతో పాటు బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని ప్రజలకు వివరిం చే ప్రయత్నం చేస్తోంది. పార్టీ అధికారంలోకి వచ్చాక అమలుచేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రచారాస్త్రాలుగా మల్చుకోవాల ని భావిస్తున్నది. ప్రధానంగా రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్న వరికి రూ. 500 బోనస్ , ధరణి స్థానంలో భూమాత పోర్టల్ తీసుకురా వడం వంటి అంశాలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రభావం చూపుతాయని అధికార కాంగ్రెస్ పార్టీ అం చనా వేస్తున్నది.దీంతోపాటు ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత గృహవిద్యుత్, రూ. 500 లకే గ్యాస్, రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ వంటి అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నిర్ణయించింది. అంతేకాకుండా గ్రామ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళన, ఫోర్త్ సిటీకి ఫౌండేషన్, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య అభివృద్ధి, మూసీ నదీ ప్రక్షాళన, ఇం టిగ్రేటెడ్ స్కూల్స్ వంటి కార్యక్రమాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్తామని కాంగ్రెస్ నేత లు చెబుతున్నారు.ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశాన్ని కూడా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నిర్ణయిం చారు. అయితే యూరియా సమస్యపై క్షేత్రస్థాయిలో కొంతమేర వ్యతిరేకత వచ్చినప్ప టికి.. కేంద్రంతో ఎప్పటికిప్పుడు సంప్రదింపులు నిర్వహించి యూరియా సమస్యను చాలా వరకు పరిష్కరించినట్టు భావిస్తున్నారు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కూడా పార్టీ శ్రేణులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూనే ఉంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజా సమస్యలపై నిరంతరం క్షేత్రస్థాయిలో ఉంటూ పార్టీ కేడర్‌కు దిశానిర్దేశం చేస్తోంది. బీఆర్ఎస్ అధికారం కోల్పోయాక .. ఆ తర్వాత వచ్చిన పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క ఎంపీ సీటు గెలుచుకోకపోవడంతో కొంతకాలం స్థబ్దతగా ఉన్నప్పటికి.. ఇప్పుడు ప్రభు త్వంపై విమర్శలు జోరు పెంచింది.ప్రభు త్వం తీసుకొచ్చిన హైడ్రాతో పేదల బతుకులు ఆగమైనాయని, యూరియా కొరతను తీర్చడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని క్షేత్ర స్థాయిలో ఆందోళలను చేపడుతూ పార్టీలో మరింత కదలిక తీసుకొచ్చే ప్రయ త్నం చేస్తున్నారు. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గజ్వేల్‌లోని తన వ్యవసాయ క్షేత్రం నుంచే పార్టీ శ్రేణులను ఎన్నిక లకు సన్నద్ధం చేస్తున్నారు.ఇక కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పార్టీ ముఖ్య నేతలు నిత్యం ప్రజల్లోనే ఉంటూ ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తు న్నారు. తద్వారా పార్టీ శ్రేణులను పనిలో పెడుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయడంలో ప్రభుత్వం విఫలమైందని 'బాకీ కార్డు' పేరుతో వినూత్న కార్యక్ర మాన్ని బీఆర్ఎస్ చేపట్టింది. యూరియా కొరతతో రైతులు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, అది తమకు స్థానిక సం స్థల ఎన్నికల్లో కలిసి వస్తుందనే అభిప్రాయం తో గులాబీ నేతలున్నారు. లోకల్‌బాడీ ఎన్నికల్లో ఈసారి సత్తా చాటాలని కమల దళం ఉవ్విళ్లూరుతోంది. ఎన్నికల హామీలు నేరవేర్చడం, ప్రజా సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా బీజేపీనే అంటూ ఆ పార్టీ నేతలు చెప్పుకుంటున్నారు. గ్రామాల్లో యువత మెజార్టీగా బీజేపీనే ఆదరిస్తున్నారని, పంచాయతీల్లో మెరుగైన స్థానాలు వస్తాయనే అంచనాతో ఉన్నారు. 20 నెలల కాంగ్రెస్ పాలనలో గ్రామాలకు చేసిందేమి లేదని, ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు కేంద్ర వాటా ఉందన్న విషయాన్ని ప్రజలకు వివరించనున్నారు. వీటితో పాటు జాతీయ రహదారులు, కేంద్రం నిధులతోనే జాతీయ ఉపాధి హామీ పనుల వంటివి అమలవుతున్నా యనే విషయాన్ని ప్రజలకు వివరించాలనే ఆలోచనతో ఉన్నారు. అసెంబ్లీలో 8 మంది ఎమ్మెల్యేలతో పాటు 8 మంది ఎంపీలు కూడా ఉన్నందున ఆయా నియోజక వర్గాల్లో బీజేపీకి అనుకూల పవనాలు వీస్తాయని ఆ పార్టీ నాయకులు ఆశిస్తున్నారు.స్థానిక ఎన్నికల్లో టికెట్ సాధించేందుకు ప్రధాన పార్టీలకు చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నేతలు తమ ప్రయత్నాలను స్పీడప్ చేశారు. రాష్ట్ర పార్టీ ముఖ్య నేతల దగ్గర లాబీయింగ్ పెరిగినట్టు తెలుస్తున్నది. రిజర్వేషన్ల ప్రకారం తమకు కలిసి వచ్చే ఆయా సామాజికవర్గాల నేతలు టికెట్లపై తమ వాదనలు పార్టీ ముఖ్యుల దగ్గర వినిపిస్తూ టికెట్లు తమకే ఇవ్వాలని విజ్ఞప్తులు చేసుకుంటున్నారు. రిజర్వేషన్ల ద్వారా ఈసారి జనరల్ స్థానాలు తగ్గడంతో ఆ సీట్లపై భారీఎత్తున ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ప్రధానంగా అధికార పార్టీలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ బం ధువులు, వారసులను రంగంలోకి దింపేందు కు ప్రణాళికలు రచిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు గ్రామాల్లో పట్టున్న నాయకులను బరిలో దింపాలనే ఆలోచనతో ఉన్నారు. అన్ని పార్టీలకు చెందిన ఆశావాహులు మాత్రం గ్రామాల్లో వివిధ కార్యక్రమాలకు హాజరవుతూ గత కొన్ని నెలలుగా హడావుడి చేస్తున్నారు.

## సంపాదకీయం

### ఐక్యరాజ్యసమితి

# పెద్దరికం ఏమైంది

ప్రపంచంలో అశాంతి పడగవిప్పి బుసలు కొడుతున్నది. గాజాలో రక్తపాతమైనా,- ఇజ్రాయి ల్-హమాస్‌ల పోరాటమైనా, ఇరాన్‌పై అమెరికా, -ఇజ్రాయిల్ దాడులైనా, భారత్‌లోని పహల్గాంలో పాక్ ఉగ్రవాదులు సాగించిన నరమేథమైనా, రష్యా-, ఉక్రెయిన్ దేశాల మధ్య సంవత్సరాల తరబడి కొనసాగుతున్న భీకర యుద్ధం ఇలా ఏదీ తీసుకున్నా ప్రపంచంలో అశాంతి పవనాలు వీచేలా చేస్తున్నాయి.అమెరికా అ ధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన లక్ష్య సాధన కోసం ప్రపంచ దేశాలపై అధిక సుంకాలు విధించి ట్రేడ్ వార్‌కు తెర తీశారు. నేపాల్ వంటి దేశాలు ప్రజాగ్రహజ్వాలల్లో చిక్కుకున్నాయి. గతంలో శ్రీలంక, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో ప్రజల తిరుగుబాటుతో ప్రభుత్వాలే పతనమయ్యాయి. ఈ దెబ్బకు ప్రపంచంలో పలు దేశాలు ఆర్థికంగా చితికిపోయాయి. ఒక వైపు యుద్ధాలతో.. మ రో వైపు అగ్రరాజ్యాల ఆధిపత్య ధోరణులతో ప్రపంచ శాంతికి తీవ్ర విఘాతం కలు గుతున్నది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపుల పర్వం.. భారత్‌కు చైనాను దగ్గరయ్యేలా చేసింది. మూడు బలమైన దేశాలైన భారత్, రష్యా, చైనాలు ఏకమైతే అమెరికాకు దీర్ఘకాలంలో ఎదురయ్యే సమస్యల గురించి ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. బ్రిక్స్ దేశాల బలోపేతం ఏక ధృవ ప్రపంచ విచ్ఛిన్నానికి మార్గం సుగమం చేస్తుంది. ట్రంప్ విధిస్తున్న టారిఫ్‌ల వల్ల ప్రపంచ వాణిజ్య రంగం అతలాకుతలం కావడమే కాకుండా ట్రేడ్ వార్ వల్ల వివిధ దేశాల మధ్య సం బంధాలు దెబ్బతింటున్నాయి. ఇటీవల ఖతార్‌పై ఇజ్రాయిల్ ఆకస్మికంగా వైమానిక దాడులు జరపడం ఆశ్చర్యం కలి గించింది. దీంతో వర్తమాన ప్రపంచం అశాంతికి నిలయంలా మారిపోయింది.ఈ పరిస్థితులను ఇలాగే వదిలేస్తే మూడో ప్రపంచ యుద్ధాన్ని ఏరికోరి ఆ హ్వానించడమే అవుతుంది. శాంతి భద్రతలు కరువైతే యుద్ధోన్మాదం విలయతాం డవం చేయక తప్పదు. ఎక్కడైతే శాంతి సుస్థిరతలకు భంగం వాటిల్లుతుందో, అక్క డ అభివృద్ధి కుంటుపడుతుంది. ఇప్పటి వరకు జరిగిన యుద్ధాలు, పలుదేశాల మధ్య సంఘర్షణలు ఈ విషయాన్ని స్ప ష్టంగా తెలియజేసున్నాయి. ప్రపంచంలోని ఇప్పటికీ చాలా దేశాల్లో ప్రజలు జీవించడానికి కనీస మౌలిక సదుపాయాలు లేవు. ఆకలి, దరిద్రం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, అవినీతి వంటి పలు అంశాలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. మూలిగే నక్కపై తాటి పండు పడిన చందంగా సామ్రాజ్య విస్తరణ కోసం వివిధ దేశాల మధ్య జరిగే యు ద్ధాల వలన ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇక భా రతదేశం కూడా అనేక దండయాత్రలకు గురైంది. స్వాతంత్ర్యానంతరం కూడా చై నా, పాకిస్తాన్ దేశాలతో భారతదేశం అనేక ఇబ్బందులకు గురికావడం చూస్తునే ఉన్నాం. భారతదేశం ప్ర పంచంలో అత్యధిక జనాభా గల ప్రజాస్వామ్య దేశం. అణ్వస్త్ర సామర్థ్యం కలిగిన బాధ్యతాయుతమైన దేశం. ప్రపంచ దేశాలతో వి స్తృ తమైన వాణిజ్య సంబంధాలు కలిగి, 4.19 ట్రిలియన్ డాలర్లతో నాల్గవ బలమైన ఆర్థిక వ్యవస్థగా అవతరించిన భారత్‌కు ఇతర దేశాల సమస్యలను పరిష్కరించగల నేర్పు, ఓర్పు ఉన్నాయి. అం దుకే రష్యా, ఉక్రెయిన్ల మధ్య యుద్ధాన్ని నిలువరించడానికి భారత్ మధ్యవర్తిత్వం వహించాలని కొన్ని ప్రపంచ దేశాలు భావిస్తున్నాయి. రష్యా చమురును కొనుగోలు చేసే దేశాల్లో భారత్ ముందు వరుసలో ఉంది. అందువల్లే రష్యా-, ఉక్రెయిన్ల మధ్య యుద్ధ విరమణకు మన దేశం పూర్తి స్దాయిలో చొరవ తీసుకునే అవకాశం ఉండడం లేదు.రష్యా వద్ద భారత్ చమురు కొనుగోలు చేయడమే ఉక్రెయిన్-, రష్యాల మధ్య యుద్ధ విరమణ జరగకపోవడానికి కారణమని ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలు అర్థ రహితం. నోబెల్ శాంతి బహుమతి కోసం ఆరాటపడుతున్న రష్యా-, ఉక్రెయిన్ యుద్ధం విషయంలో మాత్రం ఏం చేయలేకపోతున్నారు. అయితే ఈ ఏడాది చి వర్లో లేదా వచ్చే ఏడాది ప్రథమార్థంలో ర ష్యా, ఉక్రెయిన్ యుద్ధానికి చరమగీతం పా డే అవకాశముంది. ఇదే గనుక జరిగితే ప్ర పంచం ఒక గండం నుంచి బయటపడిన ట్లే. ఇక భారత్ భవిష్యత్తులో ప్రపంచంలో శాంతి స్థాపన విషయంలో కీలక భూమిక పోషించే అవకాశముంది. పాలస్తీనా విషయంలో భారత్ తన విదేశాంగ విధానం మార్చుకుని ఇజ్రాయిల్‌కు మద్దతు పలకడాన్ని పలు రాజకీయ పక్షాలు ఇప్పటి వ రకు విమర్శించాయి. అయితే గాజాపై ఇ జ్రాయిల్ జరుపుతున్న దాడులకు వ్యతిరేకంగా, పాలస్తీనాకు మద్దతుగా ఇటీవల ఐ క్యరాజ్య సమితిలో భారత్ ఓటు వేయడం గమనార్హం. భారత్ శాంతి కాముక దేశమ ని ఈ పరిణామం నిరూపించింది. ప్ర పంచ వ్యాప్తంగా భారత్‌కు పెరుగుతున్న ఆ దరణ దృష్ట్యా.. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌కు వీటో హక్కు దక్కాల్సిన అవసరముంది. ఐక్యరాజ్య సమితి ఆ విర్భావ సమయంలో 51 దేశాలకు సభ్యత్వముంటే ఇప్పుడా సంఖ్య 193కు పె రిగింది. భద్రతా మండలిలో 15 సభ్య దేశాలుంటే.. వీటిలో అమెరికా, రష్యా, చైనా, ఫ్రాన్స్, బ్రిటన్‌లు శాశ్వత సభ్య దేశాలుగా అధికారం చెలాయిస్తుండడంతో ఐక్యరాజ్యసమితి ప్రేక్షక పాత్రలా మారిపోయింది. ప్రపంచంలో శాంతి స్థాపనే ధ్యేయంగా ఉ న్నత ఆశయాలతో ఏర్పడిన ఐరాస సంస్థ ఇలా నిస్తేజంగా మారడం ఘోరవైఫల్యం కింద లెక్కకట్టొచ్చు. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన హసీనా ప్ర భుత్వాన్ని కూల్చినప్పుడు ప్రపంచ దేశాల ను శాసిస్తున్న పెద్దరికం ఎక్కడికి పోయింది? గాజా విషయంలో ఐక్యరాజ్యసమితి పాత్ర ఎంత? దశాబ్దాల తరబడి భా రత్ పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదంతో యుద్ధం చేస్తున్నా మౌనంగా ఉండడంపై ఐరాస సమాధానం చెప్పాల్సిందే. ప్రస్తుత ప్రపంచ పోకడలు అత్యంత ప్రమాదకరంగా తయారయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రపంచ సమస్యల పరిష్కారం విషయంలో భారత్‌కు తగిన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న విషయం తెలుసుకోవాలి.

# పాపం సుజనా చౌదరి



విజయవాడ, సూర్య వాస్తవం, అక్టోబర్ 1 : విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే సుజనా చౌదరి హ్యాపీగా లేరని తెలుస్తుంది. ఒకప్పుడు తెలుగుదేశం పార్టీలో టిక్కెట్లను ఇప్పించిన వ్యక్తి ఇప్పుడు బీజేపీలో టిక్కెట్ కోసం అడుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ఎన్నికల్లో విజయవాడ పార్లమెంటు స్థానాన్ని సుజనా చౌదరి ఆశించారు. కానీ తెలుగుదేశం పార్టీకి పొత్తులో భాగంగా వెళ్లింది. మరొకస్థానమయినా కేటాయిస్తారనుకున్నారు. కానీ చివరకు బీజేపీ విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి సుజనా చౌదరిని పరిమితం చేసింది. రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించిన సుజనా చౌదరి ఇప్పుడు కేవలం పశ్చిమ నియోజకవర్గానికే లిమిట్ కావాల్సివచ్చింది. పార్టీ అధ్యక్ష పదవిని ఆశించినప్పటికీ అది మాధవ్ కు దక్కడంతో ఆయన హతాశులయ్యారు.ఇక బీజేపీ నుంచి రాష్ట్ర మంత్రివర్గంలో తనకు చోటు దక్కుతుందని భావించినప్పటికీ అది కూడా చివరకు దక్కలేదు. నామమాత్రపు ఎమ్మెల్యేగానే ఆయన మిగిలిపోవాల్సి వచ్చింది. గెలిచారు కాబట్టి విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో అడపా దడపా పర్యటిస్తున్న సుజనా చౌదరి ఎక్కువ సమయాన్ని హైదరాబాద్ లోనే గడుపుతున్నారని అంటున్నారు. ఆయన ఢిల్లీ ప్రయాణాలు కూడా పెద్దగా చేయడం లేదు. ఒకనాడు ఢిల్లీలో బీజేపీ పెద్దల వద్ద దగ్గరగా మసిలిన సుజనా చౌదరి నేడు పశ్చిమ నియోజకవర్గంలోని బీజేపీ ద్వితీయ శ్రేణి నేతలతో ముచ్చటించుకోవాల్సి వస్తుంది. ఇది ఆయనలోని అసహనం బయటకు అప్పుడప్పుడు కనిపిస్తుంది. బీజేపీపై ఆగ్రహమా? కూటమి ప్రభుత్వంపై కోపమా? అన్నది తెలియదు కానీ మొత్తం మీద ఆయన అసంతృప్తిలో ఉన్నారు. ఇటీవల ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో బీజేపీ ఎమ్మెల్యే సుజనా చౌదరి కూటమి ప్రభుత్వంపై సంచలన కామెంట్స్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదిహేడు నెలలు గడుస్తున్నప్పటికీ గత వైసీపీ ప్రభుత్వ పాలనలానే నడుస్తుందని అన్నారు. అమరావతి రైతుల సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదిహేడు నెలలవుతున్నా వారి సమస్యలను పరిష్కరించలేదన్నారు. రుషికొండ ప్యాలెస్ నిర్మాణంపై గతంలో విపక్షంలో ఉన్నప్పుడు అనేక విమర్శలు చేశామని, అయితే అధికారంలోకి వచ్చి ఇన్ని నెలలవుతున్నప్పటికీ దానిపై ఇంతవరకూ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఇలా సుజనా చౌదరి తమ అక్కసును ఇలా వెళ్లగక్కుతున్నారని అంటున్నారు. మరి సుజనా చౌదరి ఆంతర్యమేంటో తెలియదు కానీ మొత్తం మీద ఆయన కొంత అసహనంగానే ఉన్నట్లు కనిపిస్తుంది.

# దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఫ్లూ కేసులు

హైదరాబాద్, సూర్య వాస్తవం, అక్టోబర్ 1 :దేశవ్యాప్తంగా ఫ్లూ కేసులు వేగంగా పెరుగుతున్నాయి. ఇది సాధారణ ఫ్లూ లాగా అనిపించే ఒక రకమైన ఇన్ఫ్లూఎంజా వైరస్, కానీ దాని లక్షణాలు ఎక్కువ కాలం ఉంటాయి. ఈ వైరస్ బారిన పడిన వ్యక్తులు అధిక జ్వరం, నిరంతర దగ్గు, గొంతు నొప్పి, శరీర నొప్పులు వంటి లక్షణాలను అనుభవిస్తారని వైద్యులు అంటున్నారు. ఇది చాలా సందర్భాలలో తగ్గినా, కొంతమంది వ్యక్తులకు ఇది మరింత ప్రమాదకరం కావచ్చని హెచ్చరిస్తున్నారు.ఎవరికి ఎక్కువ ప్రమాదం ఉంటుందంటే ఫ్లూ బలహీనమైన రోగనిరోధక వ్యవస్థ ఉన్నవారిని ప్రభావితం చేస్తుంది. వృద్ధులు, చిన్న పిల్లలు, గర్భిణీ స్త్రీలు, ఉబ్బసం, మధుమేహం లేదా గుండె జబ్బులు వంటి ముందస్తు వైద్య పరిస్థితులు ఉన్నవారు ఈ వైరస్ బారిన పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. మీరు 5 సంవత్సరాల కంటే తక్కువ లేదా 65 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉంటే ప్రత్యేక శ్రద్ధ వహించండి. ఈ వ్యక్తులకు సాధారణం కంటే తక్కువ రోగనిరోధక శక్తి ఉంటుంది. కాబట్టి ఇన్ఫెక్షన్లు త్వరగా అభివృద్ధి చెందుతాయి. జాగ్రత్త పడకుంటే తీవ్రంగా మారవచ్చు.ఈ



ఫ్లూ లక్షణాలు సాధారణ వైరల్ ఇన్ఫెక్షన్‌ల మాదిరిగానే ఉంటాయి. కానీ అవి ఎక్కువ కాలం ఉంటాయి. రోగులు అధిక జ్వరం, గొంతు నొప్పి, దగ్గు, తలనొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, నిరంతర అలసట వంటి లక్షణాలు ఉంటాయని వైద్యులు సూచిస్తున్నారు. ను అనుభవిసరు. కొన్ని సందర్భాల్లో, వాంతులు, విరేచనాలు కూడా గమనించవచ్చు. జ్వరం కొనసాగితే, శ్వాస తీసుకోవడం కష్టమైతే, వెంటనే వైద్యుడిని సంప్రదించాలని వైద్యులు సలహా ఇస్తున్నారు.ఫ్లూ నివారణకు పరిశుభ్రత, అప్రమత్తత అవసరమని నిపుణులు అంటున్నారు. రద్దీగా ఉండే ప్రదేశాలలో క్రమం తప్పకుండా చేతులు కడుక్కోవడం, మాస్క్ ధరించడం, అనారోగ్య వ్యక్తుల నుండి దూరం పాటించడం చాలా అవసరం. దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు నోటిని కప్పుకోవడం, ఉపయోగించిన టిష్యూలను సరిగ్గా పారవేయడం వల్ల ఇన్ఫెక్షన్ వ్యాప్తి చెందకుండా నిరోధించవచ్చు. అంతేకాకుండా, సమతుల్య ఆహారం, తగినంత నిద్ర, తేలికపాటి వ్యాయామం రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. ప్రతి సంవత్సరం, ముఖ్యంగా శీతాకాలం రాకముందే ఫ్లూ వ్యాక్సిన్ తీసుకోవాలని వైద్యుల సూచిస్తున్నారు.ఒక వ్యక్తికి చాలా రోజులుగా అధిక జ్వరం, నిరంతర దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటే, దానిని తేలికగా తీసుకోకండి. మందుల కోసం వైద్యుడిని సంప్రదించడం, అవసరమైతే పరీక్షలు చేయించుకోవడం చాలా ముఖ్యం. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు, వృద్ధులు, పిల్లల విషయంలో, వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి.

# శిద్ధా రాఘవరావుకు రాని గ్రీన్ సిగ్నల్



ఒంగోలు, సూర్య వాస్తవం, అక్టోబర్ 1 : మాజీ మంత్రి శిద్ధా రాఘవరావు తెలుగుదేశం పార్టీలో చేరాలనుకున్నారు. అయితే ఆయన చేరికకు మాత్రం గ్రీన్ సిగ్నల్ దొరకలేదని తెలిసింది. అందుకే శిద్ధా రాఘవరావు రాజకీయాలకు దూరంగా ఉంటున్నారని తెలిసింది. శిద్ధా రాఘవరావు ప్రస్తుతం తన వ్యాపారాలకే పరిమితమయ్యారు. ప్రకాశం జిల్లాలో గ్రానైట్ సంస్థల వ్యాపారాన్ని నిర్వహిస్తూ ఆయన సమయాన్ని గడుపుతున్నారు. అదే సమయంలో తన సామాజికవర్గానికి చెందిన కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అంతే తప్ప రాజకీయ కార్యక్రమాల్లో మాత్రం ఆయన పాల్గొనడం లేదు. ఆయన ఆర్థికంగా స్థితిమంతుడు కావడంతో పాటు వైశ్య సామాజికవర్గానికి చెందిననేత కావడంతో సహజంగా రాజకీయ పార్టీలు ఆయన చేరికకు స్వాగతం చెబుతాయి. 2014 ఎన్నికల్లో శిద్ధా రాఘవరావు దర్శి నియోజకవర్గం నుంచి పోటీ చేసి టీడీపీ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. తర్వాత చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో స్థానం దక్కించుకున్నారు. ఐదేళ్ల పాటు శిద్ధా రాఘవరావు మంత్రిగా ఉన్నారు. తర్వాత 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. తర్వాత శిద్ధారాఘవరావుకు చెందిన గ్రానైట్ కంపెనీలపై భారీగా జరిమానాలను విధించింది. దీంతో శిద్ధా రాఘవరావు కుటుంబం టీడీపీని వదిలి పెట్టి వైసీపీలో చేరింది. వైసీపీలో పెద్దగా యాక్టివ్ గా లేకపోయినప్పటికీ శిద్ధా రాఘవరావు వైసీపీలో చేరడంతో మొన్నటి ఎన్నికల్లో దర్శి నియోజకవర్గం నుంచి గొట్టిపాటి కుటుంబానికి చెందిన గొట్టిపాటి లక్ష్మికి చంద్రబాబు సీటు కేటాయించారు. దీంతో శిద్ధా రాఘవరావును ఒంగోలు పార్లమెంటుకు పోటీ చేయించాలని చూసినా కుదరలేదు. ఇక 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శిద్ధా రాఘవరావు రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఒక దశలో చంద్రబాబు నాయుడును కలిసి తిరిగి టీడీపీలో చేరాలని భావించినా అందుకు కీలక నేత ఒకరు అంగీకరించలేదని సమాచారం. వైసీపీకి రాజీనామా చేశారు. శిద్ధా రాఘవరావు రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. వైశ్య సామాజికవర్గం కార్యక్రమాల్లోనే ఆయన పాల్గొంటున్నారు. దీంతో పాటు కూటమి ప్రభుత్వంలోని నేతలతో ఆయన టచ్ లో ఉంటున్నారని, అయితే ఆయన చేరిక మాత్రం ఇప్పట్లో ఉండదని మాత్రంచెబుతున్నారు. మొత్తం మీదశిద్ధా రాఘవరావు ఇప్పుడు ఏ పార్టీలో లేకుండా ఆయన తన పని తాను చూసుకుంటున్నారు.

# తీన్మార్ మల్లన్నపై నెట్టింట సెటైర్లు

హైదరాబాద్, సూర్య వాస్తవం, అక్టోబర్ 1 : ఏపీలో పక్కన పెడితే.. తెలంగాణలో రాజకీయ పార్టీలు కొత్తవి పుట్టుకొస్తున్నాయి. గతంలో వివిధ పార్టీలు మారిన వారు.. ఆ పార్టీల ద్వారా పదవులు పొందిన వారు కొత్త రాజకీయ క్షేత్రాలను ఏర్పాటు చేస్తున్నారు. అందులో తీన్మార్ మల్లన్న కూడా ఒకడు. గతంలో తీన్మార్ మల్లన్న బిజెపిలో చేరారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా ఎమ్మెల్సీ అయ్యారు. కొంతకాలానికి ఆ పార్టీకి వ్యతిరేక స్వరం వినిపించడం మొదలుపెట్టారు. చివరికి ఆ పార్టీ నుంచి బయటికి వచ్చారు. ఇప్పుడు ఎమ్మెల్సీగా కొనసాగుతూనే కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేశారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలున్న నేపథ్యంలో తన పార్టీని విస్తరించే పనిని మొదలుపెట్టారు. ఇందులో భాగంగానే జిల్లాల వారీగా కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. అధ్యక్షులను నియమిస్తున్నారు.తాజాగా తీన్మార్ మల్లన్న తన పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో భవిష్యత్తు విధివిధానాలను ప్రకటించారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. సమావేశం ముగిసిన



తర్వాత కార్యకర్తలతో తీన్మార్ మల్లన్న బయటికి వచ్చారు.. ఈ సందర్భంగా అక్కడ నిర్వహించిన విలేకరుల సమావేశంలో తీన్మార్ మల్లన్న పార్టీ కార్యకర్తలు రెచ్చిపోయి మాట్లాడారు. ఒక కార్యకర్త అయితే వీరావేశంలో మాటలు మాట్లాడారు. తీన్మార్ మల్లన్న దేశానికి ప్రధానమంత్రి అవుతాడని.. తెలంగాణ నుంచి ఆ అదృష్టాన్ని పొందిన వ్యక్తి అవుతాడని పేర్కొన్నారు. అంతేకాదు తీన్మార్ మల్లన్న నాయకత్వం వర్ధిల్లాలి అంటూ ఆ కార్యకర్త చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తున్నాయి.తీన్మార్ మల్లన్న పార్టీ కార్యకర్తలు చేసిన వ్యాఖ్యల పట్ల సోషల్ మీడియాలో విమర్శలు వ్యక్తం అవుతున్నాయి..” మొదట్లో బిజెపిలో ఉన్నాడు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరాడు. అందులో ఎమ్మెల్సీ అయ్యాడు. చివరికి పార్టీ తీసుకున్న విధానాలను ప్రశ్నించాడు. ఆ పార్టీ సస్పెండ్ చేసింది. పార్టీ నుంచి ఎమ్మెల్సీగా గెలిచి దానికి మాత్రం రాజీనామా చేయలేదు. ఇప్పుడేమో రాజకీయ పార్టీ పెట్టాడు. రాజకీయ పార్టీ పెట్టి కొద్ది రోజులు కూడా కాకముందే తన కార్యకర్తలకు భజనలు అలవాటు చేశాడు. తనని ఏకంగా ముఖ్యమంత్రిని చేసుకున్నాడు. ఇప్పుడు ప్రధానమంత్రిని కూడా చేసేసుకున్నాడు. ఇది మామూలు కామెడీ కాదు. వాస్తవానికి ఎవరైనా సున్నా నుంచి ఎదుగుతారు. తీన్మార్ మల్లన్న మాత్రం ఏకంగా ప్రధానమంత్రి పీఠానికి సూటి పెట్టాడని” నెటిజన్లు అంటున్నారు.ఓ సామాజిక వర్గం వారిని తీన్మార్ మల్లన్న తీవ్రస్థాయిలో విమర్శించారు. ఈ నేపథ్యంలోనే తీన్మార్ మల్లన్న ను ఉద్దేశించి ప్రధానమంత్రి అని వ్యాఖ్యలు చేసిన వీడియో బయటకి రావడంతో ఆ సామాజిక వర్గం వారు రెచ్చిపోతున్నారు. ఎమ్మెల్సీగా ఉన్న వ్యక్తి ప్రధాన మంత్రి ఎలా అవుతాడంటూ ఎద్దేవా చేస్తున్నారు.

## తహశీల్దార్ కార్యాలయంలో ఆయుధ పూజ



కనేకల్, సూర్య వాస్తవం, అక్టోబర్ 1: దసరా పండుగ సందర్భంగా కనేకల్ మండల తహశీల్దార్ కార్యాలయంలో ఆయుధ పూజను తహశీల్దార్ బ్రహ్మయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందికి మరియు మండల ప్రజలకు విజయదశమి శుభాకాంక్షల ను తహశీల్దార్ బ్రహ్మయ్య తెలియజేశారు. పూజ అనంతరం అందరికీ ప్రసాద వితరణ చేయడమైనది. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ సహాయకులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



గాండ్లపెంట, సూర్య వాస్తవం, అక్టోబర్ 1 : మండలంలో వాడవాడలా బుధవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో బుధవారం తెల్లవారుజామునే పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. ఈ సందర్భంగా మండలంలోని గొడ్డు వెలగల గ్రామంలో క్లస్టర్ ఇంచార్జ్ ప్రసాద్ వృద్ధులకు పింఛన్లను అందజేశారు. అలాగే అన్ని గ్రామాల్లో చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో తెదేపా నాయకులు విరివిగా పాల్గొని వృద్ధులకు పింఛన్లు సక్రమంగా పంపిణీ జరిగేలా చొరవ చూపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు శివమూర్తి, సయ్యద్ బాష, శ్యాం కుమార్, హనుమంత్ రెడ్డి, సచివాలయ సిబ్బంది,పలువురు తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ కార్యక్రమం




గుత్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 1 : గుత్తి పట్టణంలో గుత్తి మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్ మియా ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ అనే కార్యక్రమంను ప్రజలలోకి తీసుకువెళ్లేందుకు మున్సిపల్ అధికారులు,సిబ్బంది, వర్కర్లు పాత మున్సిపల్ ఆఫీసు నుండి గాంధే సర్కిల్ వరకు ర్యాలీ ప్రోగ్రాం జరిగినది. ఈ సందర్భంగా క మీషనర్ బి.జబ్బార్ మియా ప్రజలకు తెలియజేస్తూ ప్రభుత్వం వివిధరకాల జి.యస్.టి. పన్నులను తగ్గించింది కావున మీరు వ స్తువులు,యంత్రాలు,వాహనా లు,సామాగ్రి కొన్నప్పుడు తగ్గిన జి.యస్.టి ప్రకారం కొనుగులు చేసుకోవాలని తెలియజేశారు. ప్రభుత్వం వారు ప్రవేశపెట్టిన ఈ అవకాశమును అందరూ సద్విని యోగం చేసుకోవాలని తెలిపారు. డి.ఈ.ఈ శానిటరీ ఇన్స్పెక్టర్ మహబూబ్ బాషా, ఏఈలు గోవిందప్ప, హరికిరణ్, సి.ఓ చంద్రశేఖర్, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, నోడల్ఆఫీసర్లు, మున్సిపల్ వర్కర్లు పాల్గొన్నారు.

## అనంతపురం శిల్పారామంలో నవరాత్రుల వేడుకలు

- శిల్పారామం పరిపాలన అధికారి పి.శివ ప్రసాద్ రెడ్డి






అనంతపురం టౌన్, సూర్య వాస్తవం, అక్టోబర్ 1: అనంతపురం శిల్పారామంలో దసరా పండుగ నవరాత్రుల సందర్భంగా ఆధ్వర్యంలో సంప్రదాయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ నృత్య కళా నిలయం బ్రాంచ్-1, అనంతపురం వారి బృందంచే క్లాసికల్ నృత్య ప్రదర్శనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో శరణు సిద్ధి వినాయక, గంగం గణపతి, జయ జయ త్రిపురాంజయ, సుందరమూర్తి, పుష్పాంజలి, నాగేంద్ర హారయ, శ్రీ రాజ రాజేశ్వరి, నగుమోము, నమామి, కోలాపురి, మెరగువంటివి, గుమ్మడి ఏదిశృతి, దింతన దింతన, కృష్ణాన నోడిదే, సుబికా నిఖిత లాస్య నియతి వర్షిత తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్టీ తగ్గింపుపై రైతన్నల సంబరం



నగరంలో ట్రాక్టర్ ర్యాలీ
స్వయంగా ట్రాక్టర్ నడిపి
ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన
ఎమ్మెల్యే దగ్గుపాటి
క్లాక్ టవర్ నుంచి సప్తగిరి
వరకు ట్రాక్టర్లతో ర్యాలీ
ఇది రైతు పక్షపాత
ప్రభుత్వమన్న ఎమ్మెల్యే



అనంతపురం క్రైం, సూర్య వాస్తవం, అక్టోబర్ 1 : ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం రైతు పక్షపాతిగా పనిచేస్తోందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. బుధవారం జీఎస్టీ తగ్గింపు పై అనంతపురం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో భారీ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే దగ్గుపాటి స్వయంగా ట్రాక్టర్ నడిపి అందర్నీ ఆకర్షించారు. ఎమ్మెల్యే దగ్గుపాటితో పాటు ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు. క్లాక్ టవర్ నుంచి సప్తగిరి సర్కిల్ వరకు వందలాది ట్రాక్టర్లతో ఈ ప్రదర్శన సాగింది. టిడిపి నాయకులు కార్యకర్తలు, రైతులు పచ్చ కండువాలతో ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల అత్యధికంగా ప్రయోజనాలు పొందుతున్నది వ్యవసాయ రంగం అన్నారు. ఈ ఐదారు రోజుల్లోనే వందల సంఖ్యలో ట్రాక్టర్లు కొనుగోలు చేశారన్నారు. గతంలో 12 శాతం ఉన్న జీఎస్టీ 5 శాతానికి తగ్గించడంతో రైతులు వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు వంటివి కొనుగోలు చేస్తున్నారన్నారు. గతంలో డ్రిప్పుపై 18 శాతం ఉన్న జీఎస్టీని ఐదు శాతానికి తగ్గించారన్నారు. అందులో 2.5శాతం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఈ ఏడాదిలోనే లక్ష ఎకరాలకు పైగా డ్రిప్పు, స్ప్రింక్లర్లు అందించినట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి తెలిపారు. గత పాలనలో ఒక ఎకరానికి కూడా డ్రిప్పు అందించిన పాపాన పోలేదన్నారు. గతంలో అనంతపురం జిల్లాని అంతా కరవు ప్రాంతం అనే వారని.. కానీ ఇప్పుడు హార్టికల్చర్ హబ్ గా మార్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టును పూర్తిగా గాలికి వదిలేస్తే.. కేవలం వందరోజుల్లో కాల్వ సామర్థ్యాన్ని 1800 నుంచి 3800 క్యూసెక్కులు పెంచారన్నారు. 3500 కోట్లు ఖర్చు చేసి.. 700 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుప్పానికి కూడా నీరు తీసుకెళ్లారన్నారు. జీఎస్టీ తగ్గింపు ద్వారా రైతులే కాకుండా అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతోందని.. ప్రజల తరపున ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ప్రధాని మోడీకి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు.

# సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రం ముందంజ

### కార్యకర్తల సమావేశంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



లక్కిరెడ్డిపల్లి, సూర్య వాస్తవం, అక్టోబర్ 1 : సంక్షేమం, అభివృద్ధిలో దేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముందంజలో ఉందని రాష్ట్ర రవాణా, క్రీడా యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లి పిజిఆర్ కళ్యాణ మండపంలో కార్యకర్తల సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలలోనే దేశానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సంక్షేమం అభివృద్ధిలో ఆదర్శంగా ఉందని తల్లికి వందనం స్త్రీ శక్తి పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయని రాయల సీమ ప్రాంతంలో మైనార్టీలు అధికంగా ఉన్నారని, 5,6 మంది పిల్లల ఉన్న వారి తల్లిదండ్రులు ఖాతాలో తల్లికి వందనం జమ చేయడం జరిగింది అని ఆ విధంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 90 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం వర్తింపజేశారని ఆ ఘనత చంద్రబాబు నాయుడుకు దక్కుతుంది అని అన్నారు. వైసిపి ప్రభుత్వం అమ్మ ఒడి ద్వారా 40లక్షలమంది విద్యార్థులకు మాత్రమే అందించిందని అన్నారు. డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల భర్తీలు ఘనత చంద్రబాబు నాయుడుకి దక్కుతుందని ఈ రాష్ట్రంలో నిరుపేదలకు ఉచిత ఇసుక ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. రాయచోటి ప్రాంతంలో జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి గ్రామానికి త్రాగునీరు అందించడానికి కృషి చేస్తున్నామని అన్నారు. రాయచోటి చాగలమర్రి జాతీయ రహదారి పనుల విషయంలో కాంట్రాక్టర్ తో మాట్లాడి పనులు పూర్తి చేయడానికి కృషి చేశామన్నారు. అనంతరం గ్రామాల వారీగా కార్యకర్తల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండిపల్లి లక్ష్మి ప్రసాద్ రెడ్డి లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ఎండి షఫీ నాయక్ ఏపీఐఐసీ డైరెక్టర్ భాస్కర్ రెడ్డి మాజీ మండల అధ్యక్షులు ఉమాపతి రెడ్డి దళిత వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులేసు యనమల మదనమోహన్, పోలీ సుబ్బారెడ్డి ,బీసీ నాయకులు విజయభాస్కర్ గాజుల ఖాదర్బాషా, ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ రెడ్డయ్య, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కాంట్రాక్ట్ రాజు, భాస్కర్ రెడ్డి, మల్లి తదితరులు పాల్గొన్నారు.

## రాజరాజేశ్వరిగా వాసవీ మాత, మహాకాళిగా రేణుక ఎల్లమ్మ





పామిడి, సూర్య వాస్తవం, అక్టోబర్ 1: పామిడి పట్టణంలోని ఆర్య వైష్ణవుల ఆరాధ్య దేవత వాసవి కన్యకాపరమేశ్వరి మాత బుధవారం రాజరాజేశ్వరిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఉదయం గంగ తీర్థ సేవ అభిషేకం అర్చనలు, శాంతి హెూమం నిర్వహించారు. రాత్రి నవరాత్రులు నవధాన్యాలు మహిళచే హారతుల కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఉపేంద్ర ఉపాధ్యక్షులు నల్లయ్య, వాసవి మాత మాకు మండలి ఆధ్వర్యంలో శరన్నవరాత్రులు ఘనంగా నిర్వహింపబడుచున్నవి. వచ్చిన భక్తాలు అందరికీ పురోహితులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే పట్టణంలో వాణి నగరంలోని దస్తవీధిలో వెలసిన రేణుక ఎల్లమ్మదేవి మహాకాళి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. రాత్రి కొప్పులకొండ సుబ్రహ్మణ్యం నేతృత్వంలో భజన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఆలకిస్తూ నిర్వహించారు తదుపరి పూజారి రామేశ్వరమ్మ మహా మంగళహారతి ఇచ్చారు. వచ్చిన భక్తులందరికీ అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ రంగనాయకులు ఓబులపతి సుబ్రహ్మణ్యం ఓబులేసు మధు సుబ్బరాయుడు తదితరుల ఆధ్వర్యంలో శరన్నవరాత్రులు ఘనంగా చివరి దశకు చేరుకున్నాయి.

## గుత్తి మున్సిపల్ ఆఫీసులో ఆయుధ పూజ



గుత్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 1 : గుత్తి పట్టణంలోని మున్సిపల్ ఆఫీసులో బుధవారం ఆయుధ పూజ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్ మియా చైర్పర్సన్ వన్నూర్ బీ,డి. ఈ.ఈ శానిటరీ ఇన్స్పెక్టర్ మహబూబ్ బాషా, ఏఈలు గోవిందప్ప, హరికిరణ్, సి.ఓ చంద్రశేఖర్, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, నోడల్ ఆఫీసర్లు,టిడిపి నాయకులు చికెన్ సీనా, పవన్ యాదవ్, సుంకన్న తదితరులు,వైసీపీ యువనా యకులు షఫీ మరియు మున్సిపల్ వర్కర్లు పాల్గొన్నారు.

## వన్నెదొడ్డిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



గుత్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 1 : గుత్తి మండలం వన్నెదొడ్డి గ్రామంలో ఎన్డిఎ కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ను ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు అలాగే గుంతకల్లు నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం తనయుడు గుత్తి, పామిడి ఇంచార్జ్ యువనేత గుమ్మనూరు ఈశ్వర్ సూచనలతో గుత్తి మండలం వన్నెదొడ్డి గ్రామంలో ఇంటింటా తిరిగి అర్హులైన ప్రతి ఒక్కరికి అవ్వ తాతలకు మరియు వికలాంగులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ను అందజేశారు అ లాగే అర్హులైన వారు మాట్లాడు తూ ఎన్ డిఎ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొట్టమొ దటగా అవ్వ తాతలకు పెన్షన్ 3000 నుండి 4000 పెంచడం జరిగినది అర్హులైన వారు మాట్లా డుతూ తెలుగుదేశం పార్టీకి రుణ పడి ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మా జీ వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్,దొడ్డి న రేంద్ర యాదవ్,దొడ్డి ఆదినారాయ ణ యాదవ్ మరియు సచివాల యం సిబ్బంది మరియు తెలుగు దేశం పార్టీ నాయకులు కార్యకర్త లు పాల్గొనడం జరిగినది.

# చంద్రబాబు ఎల్లప్పుడూ ముఖ్యమంత్రిగా ఉండాలి

## దేవుడిని కోరుకుంటూ దీవెనలు అందిస్తున్న వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు

## టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం పరిశీలకుడు గాజుల ఖాదర్ బాషా





అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, అక్టోబర్ 1 : చంద్రబాబు నాయుడు ఎల్లప్పుడూ ముఖ్యమంత్రిగా ఉండాలని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు దేవుడిని కోరుకుంటూ దీవెనలు అందిస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు గాజుల ఖాదర్ బాషా తెలిపారు. రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం గౌరవ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారి ఆధ్వర్యంలో.. బుధవారం నాడు వీరభద్ర స్వామి దేవాలయం వీధి మార్కెట్ వీధిలో సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి గాజుల ఖాదర్ బాషా పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారు పెన్షన్ల విషయంలో పూర్తిగా మోసం చేశారని చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే చెప్పిన ప్రకారంగా మాట తప్పకుండా మడమ తిప్పకుండా వృద్ధులకు, వితంతువులకు 4000 రూపాయలు, దివ్యాంగులకు 6000 రూపాయలు, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు పదివేల రూపాయలు, దీర్ఘకాల మంచంపై ఉన్నవ్యాధిగ్రస్తులకు 15000 రూపాయలు పెన్షన్లు అందిస్తున్న దేశంలోనే ఏకైక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒక్కరే అని గాజుల ఖాదర్ బాషా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు చంద్రబాబు నాయుడు గారిని సూపర్ బాబు అని కొనియాడుతున్నారని.. చెప్పింది చేసే సత్తా గల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ఒక్కరే అని ప్రతి ఒక్కరి నోటి నుండి వినిపిస్తున్న మాట ఇదే అని చెప్పారు.

### సూపర్ సిక్స్ హామీలు

పెన్షన్ల కార్యక్రమం. అన్న క్యాంటీన్లు. అన్నదాత సుఖీభవ. 16347 అధ్యాపకుల పోస్టులు భర్తీ. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం.. దీపం పథకం కింద ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు. చెప్పినవన్నీ హామీలు అమలు చేసి. చెప్పనవి కూడా ప్రజలు సంతోషంగా ఉండాలని వారికి అన్ని విధాలుగా ఆదుకుంటూ వారి కష్టాల్లో పాలు పంచుకుంటూ వెళుతున్న ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ఒక్కరే అని తెలిపారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి రాయచోటి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయనిధి కింద దాదాపుగా ఇప్పటికే ఐదుకోట్ల పైచిలుకు చెక్కులను వివిధ అనారోగ్య కారణాలతో కార్పొరేట్ ఆసుపత్రులలో చూపించుకుని వైద్యం కొరకు డబ్బులు లేక వడ్డీలు తెచ్చుకొని చూపించుకున్న వారికి రాయచోటి చాలా వెనుకబడిన ప్రాంతమని రాయచోటిలో పేదలు చాలామంది ఉన్నారని ముఖ్యమంత్రికి తెలియజేసి రాష్ట్రంలోనే ఏ నియోజకవర్గంలో లేని విధంగా పెద్ద మొత్తంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అనారోగ్యంగా ఉన్న లబ్ధిదారులకు అందించిన ఘనత మంత్రి రాంప్రసాద్ రెడ్డి గారికి దక్కుతుందని తెలిపారు. కొత్తగా ప్రత్యేక డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు మంత్రి నారా లోకేష్ బాబు గారికి వారి గుండెల్లో నుండి వారి కుటుంబమంతా దీవెనలు అందిస్తున్నారని ఇంత పెద్ద ఎత్తున 16,347 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడం ఇది ఒక చరిత్రత్మక విషయమని తెలిపారు. రాష్ట్రంలో ఏ మూల చూసినా కూడా ఇది ఒక మంచి ప్రభుత్వమని ప్రజల ప్రభుత్వమని గత ప్రభుత్వం ప్రజలను హింసించి దౌర్జన్యంతో పాలన సాగించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది అంజి మరియు రోఫా హైదర్ అమీర్ పెంచలయ్య శీను అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

# 'ఉపాధి' పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

## కల్పనాయన చెరువులో నాటిన మామిడి మొక్కలపై ఆరా - రామాపురం మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తనిఖీలు





అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, అక్టోబర్ 1: అన్నమయ్య జిల్లాలోని రాయచోటి నియోజకవర రామాపురం మండలం కల్పనాయన చెరువు గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద నాటిన మామిడి మొక్కలను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పిడి డ్వామా వెంకటరత్నం ను మామిడి మొక్కలు ఎప్పుడు, నాటారు నాటడానికి ఎంతమంది పని వాళ్ళను వినియోగించారు, ఎన్ని పని దినాలు పట్టింది వంటి పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. అనంతరం రామాపురం మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆరోగ్య కేంద్రంలో ఇన్ పేషంట్ గా ఉన్న వ్యక్తితో ఆరోగ్య కేంద్రంలో వైద్య చికిత్సపై పలు ప్రశ్నలు అడిగారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ అధికారి లక్ష్మీనరసయ్యకు మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్యాధికారికి జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు.

# పామిడిలో సంక్షేమ దసరా పండుగ

## సచివాలయ సిబ్బందికి నిత్యావసర సరుకులు పంపిణీ చేసిన ఎంపీడీవో తేజోష్ణ






పామిడి, సూర్య వాస్తవం, అక్టోబర్ 1: మండల కేంద్రమైన పామిడి పట్టణంలో బుధవారం సంక్షేమ దసరా పండుగ నిర్వహించారు. ఇంటి వద్దకే వృద్ధులకు పెన్షన్లు పంపిణీ, పంచాయతీ కార్మికులకు దసరా పండుగ సందర్భంగా ఇంటి నిత్యవసర సరుకులు, వస్తువులు, నూతన వస్త్రాలు, సబ్బులు డేటాయిల్ పంపిణీ చేశారు.ప్రజా సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేస్తూ, పామిడి మండలంలో అధికారులు పలు ముఖ్య కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. ఎంపీడీవో తేజోష్ణ, డిప్యూటీ ఎంపీడీవో అస్వర్త నాయుడు, ప్రత్యేక అధికారి అర్చన ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం,జీఎస్టీపై ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. పామిడి పట్టణంలోని భావసార క్షత్రియ కళ్యాణమంటపములో బుధవారం అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈవేడుకల్లో గుంతకల్ రెవిన్యూ డివిజినల్ అభివృద్ధి అధికారి, శ్రీనివాసులు యం.పి.డి.ఓ. తేజోష్ణ, తహసి ల్దార్ షర్మిల, పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని వృద్ధులకు గౌరవ వందనాలు, శుభాకాంక్షలు తెలిపారు. వయోవృద్ధుల సమస్యలు విశిష్ట తలు వారి అవసరాలు గూర్చి క్లబ్‌లాగా వివరించారు. వయోవృద్ధు లకు సన్మానాలు చేసి దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే రైతులకు 'సూపర్ సేవింగ్స్'పై అవగాహన, జి.యస్.టి. తగ్గింపు వల్ల రైతులకు, శ్రామికులకు కలిగే ప్రయోజనాలను వివరించడానికి పట్టణ పురవీధులలో ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్, నినాదాలతో మారుమ్రోగినది. ఈ ర్యాలీ ద్వారా వ్యవసాయ, హార్టికల్చర్,చేపల పెంపకందారులకు తగ్గిన జీఎస్టీ రేట్ల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో,యం.పి.డి.ఓ, తేజోష్ణ,తహసిల్దార్ షర్మిల, ప్రత్యేక అధికారి అర్చన,ఏపీవో ఆది నారాయణమ్మ, తదితర అధికారులు,ఉపాధి హామీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, స్థానిక సచివాలయాల సిబ్బంది, రైతులు, కూటమి ప్రభుత్వపు నాయకులు, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొని మైకులు ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.



## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మదనపల్లె, సూర్య వాస్తవం, అక్టోబర్ 1: చౌడేపల్లి మండలం బోయకొండ ఆర్చి వద్ద బైకు అదుపు తప్పి పడి ఓ యువకుడు బుధవారం రాత్రి మృతి చెందాడు. ఘటనపై చౌడేపల్లి ఎస్సై నాగేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. చౌడేపల్లి మండలంలోని బోయకొండ అమ్మవారి షాపింగ్ కాంప్లెక్స్ లో వ్యాపారాలు నిర్వహించే వై.జయరాం కొడుకు సునీల్(26) బైకులో బోయకొండ ఆర్చి వద్దకు బుధవారం సొంత పనిపై బైక్ లో వెళుతుండగా, మార్గమధ్యంలోని ఏసి రూముల వద్ద బైకు అదుపుతప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుని వెంటనే మదనపల్లి కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

## కూటమి ప్రభుత్వంలోనే

# అర్హులందరికీ పింఛన్లు



గోరంట్ల, సూర్య వాస్తవం, అక్టోబర్ 1: కూటమి ప్రభుత్వం హయాంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపడు తున్నామని పెంచిన పింఛన్లతో వారి కుటుంబాలకు ఆసరాగా, భరోసాగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పింఛన్లు ప్రతినెల అందిస్తున్నారని మాజీ కోఆప్షన్ సభ్యులు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు షేక్ అజ్మతుల్లా తెలిపారు, ఈ సందర్భంగా గోరంట్ల పట్టణంలోని నాలుగో వార్డులో రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవితమ్మ ఆదేశాల మేరకు బుధవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో అజ్మతుల్లాతో పాటు సచివాలయ ఉద్యోగి కైరున్నీసా, మైనార్టీ నాయకులు అమానుల్లా, ఉస్మాన్ ఖాన్, రఫీక్,అలీఖాన్ తో పాటు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా టీవీ గుత్తి విలేకరి నరసింహకు అవార్డు



గుత్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 1: గుత్తి మండలం ధర్మాపురం గ్రామానికి చెందిన తిరుపతి నరసింహ ప్రజా టీవీ గుత్తి మండల విలేకరిగా పనిచేస్తున్నారు. గుత్తి మండలంలోని ప్రజా సమస్యల పైన అధికారులు, అనధికారుల వార్తలు సేకరించడంలో మంచి ప్రతిభ కనబరిచినందుకు ప్రజా టీవీ యాజమాన్యం గుర్తించి నరసింహకి బెస్ట్ రిపోర్టర్ అవార్డు ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో ప్రజా టీవీ ఎండి డాక్టర్ మార్నే బాల నరసింహులు, ప్రజా టీవీ గుంతకల్లు నియోజకవ ర్గం ఇంచార్జ్ వీరాంజనేయులు,గు త్తి ప్రజా టివి విలేఖరి గద్దల మో హన్ బాబు,ఎన్ వి టీవీ విలేకర్ ఆదినారాయణ,వన్నెల టీవీ రాజు మరియు ముఖ్యఅతిథిగా గ్రానైట్ రామాంజనేయులు మరియు వై ఎస్ఆర్సిపి ప్రకాష్ గౌడ్ తదితరు లు పాల్గొన్నారు.

## రేణుక ఎల్లమ్మ సేవలో హస్తకళల డైరెక్టర్ సోమశేఖర్



గోరంట్ల, సూర్య వాస్తవం, అక్టోబర్ 1: గోరంట్ల పట్టణం లోని పులేరు రోడ్డు నందు వెలసిన శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి ఆలయము నందు దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ పొగాకుల సోమ శేఖర్ మరియు కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ సందర్భంగా ఈడిగ గౌడ సంఘం నాయకులు ఘన సన్మానం చేసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

## మహిషాసుర మర్దిని అలంకరణలో రేణుక ఎల్లమ్మ దేవి



గోరంట్ల, సూర్య వాస్తవం, అక్టోబర్ 1: గోరంట్ల పట్టణంలోని పులేరు రోడ్డులో గల నాగుల బావి పక్కన ఈడిగ గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం మహిషాసుర మర్దినిగా అలంకరించి, ఈడిగ కులస్తులు ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలను గౌడ సంఘం నాయకులు పంపిణీ చేశారు.

## అనుమానాస్పద స్థితిలో కడపవాసి మృతి



మదనపల్లె, సూర్య వాస్తవం, అక్టోబర్ 1: అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె మండలంలో కడప వ్యక్తి బుధవారం హంద్రీ-నీవ కాలువలో పడి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపుతోంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లి మండలం, వలస పల్లె పంచాయతీ, పుంగనూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న ఆర్. కిషోర్ రెడ్డి (32) దుర్గాడాబాకు సమీపంలోని వెనక వైపున ఉన్న హంద్రీ-నీవ కాలవలో పడి అనుమానాస్పద స్థితిలో చనిపోయి ఉండడాన్ని బుధవారం ఉదయం స్థానికులు గుర్తించి తాలూక పోలీసులకు సమాచారం. మృత్యువాత పడ్డాడు. మృతుడు ఆత్మహత్య చేసుకున్నాడా లేక ప్రమాద వశాత్తు కాలువలో పడి మృతి చెందాడా.. అనే కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు





పుట్టపర్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 1: దుర్గామాత మహిషాసురుని సంహరించి చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ సందర్భంగా రాష్ట్ర వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ వైద్య విద్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ మరియు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ జిల్లా ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు బుధవారం వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నవరాత్రులలో భాగంగా శక్తి స్వరూపిణి అయిన అమ్మవారిని తొమ్మిది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో పూజించి... పదవరోజు దశమితో విజయానికి సంకేతంగా దసరా పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకుంటారన్నారు. ఈ దసరా పండుగ జిల్లా ప్రజలందరికి ధనం, ధ్యానం, ధైర్యం, అభయం, విజయం, ఆరోగ్యం, విద్య, సంతానం, సౌభాగ్యంతోపాటు ఆయుః రారోగ్యాలను కలుగజేయాలని... అన్ని రంగాలలో జిల్లా సమగ్ర అభివృద్ధి సాధించాలని వారు ఆ ప్రకటనలో ఆకాంక్షించారు.

### అనంతపురం జిల్లా ప్రజలకు

## విజయదశమి శుభాకాంక్షలు

- ప్రజలందరూ సుఖసంతోషాలతో పండుగ జరుపుకోవాలని విజ్ఞప్తి
- దేవి ఉత్సవాలు జరిగే దేవాలయాల వద్ద పటిష్ట బందోబస్తు
- దొంగతనాలు జరగకుండా ప్రత్యేక నిఘా
- జిల్లా ఎస్పీ పి.జగదీష్



అనంతపురం క్రైం, సూర్య వాస్తవం, అక్టోబర్ 1: అనంతపురం జిల్లా ప్రజలందరికీ జిల్లా ఎస్పీ పి.జగదీష్ విజయ దశమి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలోని ప్రతీ ఒక్కరూ సుఖసంతోషాలతో దసరా పర్వదినాన్ని జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. దేవి నవరాత్రి ఉత్సవాలు మరియు దసరా వేడుకల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పటిష్ట బందోబస్తు చేపట్టారు. దసరా ఉత్సవాలు జరిగే దేవాలయాలు, నవరాత్రి ఉత్సవాలు జరిగే అమ్మవారి ఆలయాలు, శమీ వృక్షాలున్న ప్రదేశాల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా బందోబస్తుతో పాటు ఆయా పరిసరాలలో దొంగతనాలు జరుగకుండా ప్రత్యేక నిఘా వేశారు. గస్తీ పెంచారు. మొబైల్ సెక్యూరిటీ హ్యాండ్ హెల్డ్ డివైస్ (పాపిల్లాన్ మొబైల్ డివైస్) ద్వారా అనుమానితులను చెక్ చేస్తున్నారు. వీటితో పాటు డ్రోన్ కెమేరాలను ఎగురవేసి భక్తాదుల భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, నేరాల నియంత్రణపై దృష్టి సారించారు.

## నూర్‌బాషా ఆధ్వర్యంలో సాబ్దిన్ వాలీబాల్ టోర్నమెంట్




పత్తికొండ టౌన్, సూర్య వాస్తవం, అక్టోబర్ 1: పత్తికొండ పట్టణంలో విజయదశమి సందర్భంగా వాలి బాల్ టోర్నమెంట్ టోర్నమెంట్ పేరు "సాబ్దిన్" వాలీబాల్ టోర్నమెంట్". తేదీ మరియు సమయం:01-10-2025 నుంచి 02-10-2025 వరకు నిర్వహించబడును. ప్రదేశం: టోర్నమెంట్ కల్లుపెట్టపెంట వీధి,సొసైటి వాలి బాల్ కోర్టు లో నిర్వహించబడుతుంది. నిర్వాహకులు: టోర్నమెంట్‌ను సాబ్దీన్ నూర్ బాషా నిర్వహిస్తున్నారు. టోర్నమెంట్లో 15జట్లు పాల్గొంటున్నాయి. గెలిచిన మొదటి,రెండవ టీంలకు గౌరవనీయులు వైఎస్ఆర్సీపీ మైనరటి ప్రధాన కార్యకర్త,మహమ్మదీయ మస్జిద్ ప్రెసిడెంట్ సాబ్దీన్ నూర్ బాషా బహుమతులు టోర్నమెంట్‌లో విజేతలకు అందిస్తారు. ఈ టోర్నమెంట్ ను అనుభవజ్ఞులు ల మధ్య నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్ర్యమంలో లయార్ మల్లికార్జున, జిలన్, వార్డ్ మెంబర్ షైక్షావలి,ఇబ్రహీం తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొంటున్నారు.




# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు

డోన్, సూర్య వాస్తవం, అక్టోబర్ 1: డోన్ పట్టణము డోన్ ఎమ్మెల్యే జయ సూర్య ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి పింఛన్ల పంపిణి కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు,టీడీపీ నాయకులు, ఎమ్మార్వో, ఎండిఓ, ఆఫీసర్స్, ఇతర సచివాలయం సిబ్బంది పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం పేద మహిళలకు, అవ్వ తాతలకు, రైతులకు, ఆటోడ్రైవర్స్ కి సూపర్ సిక్స్ పథకాలను అమలుచేసి, పేదల పక్షాన నిలిచారు. అలాగే అక్టోబర్ నుండి జీఎస్టీ చార్జెస్ తగ్గించడం జరిగింది. కరెంట్ బిల్ చార్జెస్ తగ్గించి పేదల సంక్షేమమే ఎన్డీఏ ప్రభుత్వం యొక్క ధ్యేయం అని



నిరూపించిన ప్రభుత్వం. అనంతరం ప్రతి ఒక్కరికి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణి చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అందరు పాల్గొన్నారు.





# పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా నానబాల సుబ్బారావు

నాయుడుపేట, సూర్య వాస్తవం, అక్టోబర్ 1: నాయుడుపేట గ్రామ దేవత శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ గా నానబాల సుబ్బారావు ప్రమాణ స్వీకారం చేశారు.బుధవారం పట్టణంలోని శ్రీ పోలేరమ్మ ఆలయ ఆవరణలో జరిగిన ఆలయ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ గా నానబాల సుబ్బారావు,పలువురు కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మాట్లాడుతూ శ్రీ పోలేరమ్మ కమిటీ నిబద్ధతతో పనిచేసి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఆలయ కమిటీ



నియమించిన ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ల తోపాటు తెలుగుదేశం పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.వారి ఆదేశాల మేరకు గ్రామదేవత శ్రీ పోలేరమ్మ సేవ చేస్తూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలియజేశారు. అనంతరం పలువురు నాయకులు ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు,ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం లకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, నాయుడుపేట ఎ ఎం సి చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్,ఎ ఎం సి వైస్ చైర్మన్ కె.గోపాల కృష్ణ,చిల్లకూరు సొసైటీ డైరెక్టర్ కె. గోపాల్,తెలుగుదేశం పార్టీ నాయకులు నెలవల రాజేష్,కట్టా వెంకట రమణారెడ్డి,కరీంబాయి చెంచయ్య,పసల గంగా ప్రసాద్,అవధానం సుధీర్,జి వి ఆర్ నాయుడు,వినుకొండ ధనుంజయ, అబోతుల బాబు,పలువురు నాయకులు పాల్గొన్నారు.





# కనసానివారిపల్లెలో తాగునీటికి ఇబ్బందులు

తనకల్లు, సూర్య వాస్తవం, అక్టోబర్ 1: శ్రీ సత్య సాయి జిల్లా తనకల్లు మండలం కనసానివారిపల్లెలో నీళ్లతో పడుతున్న ఇబ్బందులు తనకల్లు మేజర్ పంచాయతీ ఆఫీస్ లో ఇప్పటికీ ఐదుసార్లు ఫిర్యాదు చేసినాము కనసానివారి పల్లిలో నీళ్లతో చాలా ఇబ్బందిగా ఉంది అని ఒక్కసారి గాని దీని గురించి పట్టించుకోలేదు కనసానివారిపల్లి లో ఒక ట్యాంకి మిర్చి పడిపోయిందని చెప్పినా గాని వస్తారు చూసుకొని వెళ్ళిపోతారు మండలంలో అధికారులు స్పందించి తక్షణమే తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు. కనసానివారిపల్లెలో తాగడానికి గాని నీళ్లు లేవు ఈరోజు కనసానివారిపల్లి గ్రామస్తులు అందరూ వెళ్లి పంచాయతీ ఆఫీస్‌లో ఫిర్యాదు చేసినారు, ఫిర్యాదుమేరకు తాగునీటి సమస్య పరిష్కరిస్తామని వెల్లడించారు



గ్రామాల్లోకి వెళ్లి నీళ్ల సమస్య అధికారులు తక్షణమే బాధ్యతలు చేపట్టాలని గ్రామస్తులు వాపోతున్నారు నీళ్లతో



పడే అవస్థలు దీనిపైన ఎంపీడీఓ స్పందించి కనసానివారి పల్లి ప్రజలకి న్యాయం చేయాలని కోరుకుంటున్నాం.



## భవానీల రాకతో కనకదుర్గమ్మ కొండపై పెరిగిన రద్దీ

విజయవాడ, సూర్య వాస్తవం, అక్టోబర్ 1: భవాని మాలధారుల రాకతో ఇంద్రకీలాద్రి పర్వతం జై భవాని నినాదాలతో మార్మోగుతోంది. రైల్వే స్టేషన్, బస్టాండ్ ప్రాంతాల నుంచే అధికార యంత్రాంగం ఒక నిర్దిష్ట పద్ధతిలో ఎక్కడా భక్తుల రద్దీ కారణంగా ట్రాఫిక్ అవరోధాలు ఎదురుకాకుండా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, నగర పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర బాబు, శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం కార్యనిర్వాహణాధికారి శీనానాయక్ లు ఇస్తున్న ఆదేశాలతో చక్కని సమన్వయంతో భక్తులకు అవసరమైన ప్రాథమిక అవసరాలను తీర్చేలా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ అవకాశము కల్పించడంతో మహిళా భక్తుల సంఖ్య బాగా పెరిగింది. అమ్మ దర్శనం కోసం వచ్చే ప్రతి భక్తునికి సంతృప్తికర దర్శన భాగ్యం లభిస్తోంది. అధికార యంత్రాంగం నవరాత్రి ఉత్సవాలలో బాధ్యతలు నిర్వహిస్తున్న వివిధ శాఖలకు చెందిన ఇతర ప్రాంతాల అధికారులకు సైతం ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తోంది. సాధారణ భక్తుల సంతృప్తికర దర్శనమే లక్ష్యంగా అధికారులు నిర్ణయాలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇచ్చింది. భక్తులకు సురక్షిత తాగునీరు, బిస్కెట్ ప్యాకెట్ల పంపిణీ, చిన్నారులకు వేడిపాలు, అత్యవసర వైద్య సదుపాయం వంటి ప్రాథమిక సదుపాయాల కల్పనలో అధికారులు పలు జాగ్రత్తలు తీసుకున్నారు. భవానీల కోసం ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఎంతో భక్తితో మాలధారణ చేపట్టిన భవానీలు మాలధారణ విరమణ సమయంలో ఎక్కడా అసంతృప్తి తలెత్తకుండా అమ్మ దర్శనం కోసం ఇంద్రకీలాద్రి పర్వతానికి వచ్చిన ప్రతీ ఒక్కరు భక్తి భావంతో దర్శించుకునేందుకు ఎటువంటి అవాంతరాలు లేకుండా ఆధ్యాత్మిక అలౌకిక ఆనందానుభూతులతో దర్శన భాగ్యం కల్పించడమే లక్ష్యంగా వివిధ శాఖలు తీసుకుంటున్న చర్యలతో భక్తులు తమ సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

# 'మాస్ జాతర' రిలీజ్ డేట్ ఫిక్స్



'మాస్ జాతర' రిలీజ్‌కి సంబంధించి రవితేజ అభిమానులకు, ప్రేక్షకులకు దసరా సందర్భంగా ఓ సర్‌ప్రైజ్ అప్‌డేట్‌ను మేకర్స్ ఇచ్చారు. ఈ చిత్రాన్ని ఈనెల 31న విడుదల చేస్తున్న ట్లు ప్రకటించారు. వింటేజ్ వైబ్స్, పక్కా కమర్షియల్ అంశాల తో ఈ చిత్రం థియేటర్లలో అసలుసిసలైన మాస్ పండుగను తీసుకురాబోతుంది. ఇప్పటివరకు ఈ సినిమా నుండి విడుద లైన ప్రతి కంటెంట్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకొని, వినో దాల విందుకి హామీ ఇచ్చింది. కొత్త విడుదల తేదీ ప్రకటన సందర్భంగా రవితేజ, హైపర్ ఆదిలపై చిత్రీకరించిన ఒక సరదా వీడియోను చిత్ర బృందం విడుదల చేసింది. ఆ వీడియోలో హైపర్ ఆది 2025 సంక్రాంతి, వేసవి సెలవులు, వినాయక చవితి అంటూ పలుసార్లు సినిమా వాయిదా పడటాన్ని సరదా గా ఎగతాళి చేయగా.. ఆలస్యానికి గల కారణాలపై రవితేజ అంతే చమత్కారంగా స్పందించారు. మాస్ మహారాజా రవితేజ అంటేనే సం దడి. ఒకప్పటి మాస్ మహారాజాను గుర్తుచేస్తూ.. సినిమా తాలూకా ఆహ్లాదకరమైన, వినోదాత్మక శైలిని చూపిస్తూ ఈ వీడియో ఎంతో ఉత్సాహభరితంగా సాగింది. రవితేజ, శ్రీలీల జంటగా నటిస్తున్న ఈచిత్రానికి దర్శకత్వం: భాను బోగవరపు, నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కూర్పు: నవీన్ నూలి, ఛాయాగ్రహణం: విధు అయ్యన్న, మాటలు: నందు సవిరిగాన, కళా దర్శకత్వం: శ్రీ నాగేంద్ర తంగాల, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: ఫణి కె. వర్మ. సమర్పణ: శ్రీకర స్టూడియోస్, నిర్మాణ సంస్థలు: సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్.

# శశిరేఖగా నయనతార



చిరంజీవి, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబోలో రూపొందుతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మన శంకరవర ప్రసాద్ గారు'. నయనతార హీరోయిన్. ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి నిర్మిస్తున్నారు. అర్చన సమర్పిస్తున్నారు. శశిరేఖగా నయనతారను పరిచయం చేస్తూ మేకర్స్ బుధవారం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. పసుపు రంగు చీరలో మెరిసి పోతూ కనిపించిన ఆమె లుక్ అదిరిపోయింది. ముత్యాల హారం, సంప్రదాయ గాజులతో, చేతిలో నలుపు రంగు హ్యాండిల్‌తో ఉన్న గొడుగును పట్టుకొని, ఫెస్టివల్ వైబ్‌లో కనిపించిన ఈ లుక్ శశిరేఖ పాత్రకు గొప్ప సొగసుని తీసుకొచ్చింది. నయనతార పాత్ర కథలో చాలా కీలకంగా ఉండబోతోంది. ఆసక్తికరమైన విషయం ఏంటంటే, సాధారణంగా సినిమా ప్రమోషన్లకు దూరంగా ఉండే నయనతార ఈ చిత్ర ప్రచార కార్యక్రమాల్లో మొదటి నుంచే చురుకుగా పాల్గొంటున్నారు. విజయదశమి శుభసందర్భంగా ఒక ప్రత్యేక సర్‌ప్రైజ్‌ను అనౌన్స్ చేస్తున్నట్లు మేకర్స్ తెలియజేశారు. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా ఈ సినిమా విడుదల కానుంది.

# మాస్ బీట్‌తో 'అమెరికా నుండి వచ్చాను..'



హీరో నాగశౌర్య నటిస్తున్న పక్కా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'బ్యాడ్ బారు కార్తీక్'. రామ్ దేశినా (రమేష్) దర్శకత్వం వహిస్తున్నారు. విధి హీరోయిన్. శ్రీ వైష్ణవి ఫిల్మ్స్ బ్యానర్‌పై శ్రీనివాసరావు చింతలపూడి నిర్మిస్తున్నారు. తాజాగా మేకర్స్ 'అమెరికా నుండి వచ్చాను పాటని రిలీజ్ చేశారు. 'హారిస్ జయరాజ్ ఈ సాంగ్‌ని ఫుట్ ట్యాపింగ్ నెంబర్‌గా కంపోజ్ చేశారు. చంద్రబోస్ రాసిన లిరిక్స్ మాస్‌ని ఆకట్టుకోవడంతో పాటు చాలా డెప్త్ మీనింగ్‌తో ఉన్నాయి. చందన బాల కళ్యాణ్, గోల్డ్ దేవరాజ్ వోకల్స్ సాంగ్‌లో మరింత ఎనర్జీ నింపాయి. ఈ సాంగ్‌కి సోషల్ మీడియాలో అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఇప్పటికే నాగశౌర్య క్యారెక్టర్ ఇంటెన్స్ నేచర్‌ని ప్రజెంట్ చేసిన ఈ సినిమా ఫస్ట్ లుక్‌కి, ఫస్ట్ సింగిల్ 'నా మావ పిల్లనిత్తానన్నాడే' సాంగ్‌కి అద్భుతమైన రెస్పాన్స్ రావడంతో సినిమాపై అంచనాలు పెరిగాయి' అని చిత్ర యూనిట్ తెలిపింది. సముద్రఖని, సీనియర్ నరేష్, సాయికుమార్, వెన్నెల కిషోర్, మైమ్ గోపి, శ్రీదేవి విజయ్ కుమార్, వెన్నెల కిషోర్ వంటి ప్రముఖ తారాగణం కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: రామ్ దేశిన (రమేష్), నిర్మాత: శ్రీనివాసరావు చింతలపూడి, డీవోపీ: రసూల్ ఎల్లోర్, సంగీతం: హారిస్ జైరాజ్, ఆర్ట్: రామాంజనేయులు, ఎడిటర్: కోటగిరి వెంకటేశ్వరరావు, ఫైట్స్– సుప్రీమ్ సుందర్, పృధ్వీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యుసర్: శంకర్.





# శుభ్‌మన్ సేనకు తొలి పరీక్ష

## నేటి నుంచి వెస్టిండీస్‌తో తొలి టెస్ట్ ఉదయం 9.00గం.ల నుంచి

**అహ్మదాబాద్:**
ఇంగ్లండ్ పర్యటనలో అదరగొట్టిన టీమిండియా టెస్ట్ జట్టు.. స్వదేశంలో వెస్టిండీస్‌తో సిరీస్‌కు సిద్ధమైంది. భారత్–వెస్టిండీస్ జట్ల మధ్య రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ గురువారం నుంచి ప్రారంభం కానుంది. తొలిటెస్ట్‌కు అహ్మదాబాద్, రెండో టెస్ట్ ఢిల్లీలో జరగనున్నాయి. ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లిన జట్టునే వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్‌కు టీమిండియా సిద్ధమైంది. టెస్ట్ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్‌కు స్వదేశంలో ఇదే తొలి పరీక్ష. డబ్ల్యుటిసి పాయింట్లను దృష్టిలో ఉంచుకొని టీమిండియా ఈ సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాల్సి ఉంది. మరోవైపు టెస్టుల్లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్న విండీస్ జట్టుకు ఈ సిరీస్ కత్తిమీద సాములాంటిదే. ఆసియాఖండ పిచ్‌లు స్పిన్‌కు స్వర్గధామం కావడంతో ఆ జట్టు బ్యాటర్లు క్రీజ్‌లో నిలదొక్కుకోవాలంటే చెమటోడ్చాల్సిందే.

ఇంగ్లండ్ పర్యటనలో భాగంగా ఐదు టెస్టుల్లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అత్యధికంగా 700కు పైగా పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. అలాగే జైస్వాల్, కెఎల్ రాహుల్, సాయి సుదర్శన్ ఫామ్‌లో ఉండడం భారత్‌కు కలిసిరానుంది. ఆల్‌రౌండర్లు జడేజా, సుందర్, నితీశ్‌రెడ్డితోపాటు పేసర్లు బుమ్రా, సిరాజ్ బౌలింగ్‌లో చెలరేగితే విండీస్ బ్యాటర్లు పెవీలియన్‌కు క్యూ కట్టాల్సిందే. ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను 2–2తో సమం చేసిన ఉత్సాహంతో టీమిండియా ఈ సిరీస్‌కు సిద్ధం కాగా.. విండీస్ జట్టు పసికూన నేపాల్ చేతిలో టి20 సిరీస్‌ను చేజార్చుకొన్న ఒత్తిడిలో ఉంది. రెండో, చివరి టెస్ట్ ఢిల్లీ వేదికగా 10నుంచి ప్రారంభం కానుంది.

**జట్లు(అంచనా)**
ఇండియా: గిల్(కెప్టెన్), జైస్వాల్, కెఎల్ రాహుల్, సాయి సుదర్శన్, ధృవ్ జురెల్(వికెట్ కీపర్), జడేజా(వైస్ కెప్టెన్), సుందర్, నితీశ్‌రెడ్డి, అక్షర్/కుల్దీప్, బుమ్రా, సిరాజ్.
**వెస్టిండీస్:** ఛేస్(కెప్టెన్), వర్రికన్(వైస్ కెప్టెన్), ఆండెర్సన్, అథంజె, క్యాంప్‌బెల్, చంద్రపాల్, హోప్(వికెట్ కీపర్), కింగ్, ఫిలిప్, బ్లేడ్స్, పియర్రీ/సీల్స్.

# పోచంపల్లి నేతన్నలచే హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జెర్సీ




హైదరాబాద్: ప్రైమ్ వాలీబాల్ లీగ్ సీజన–4లో బరిలోకి దిగుతున్న హైదరాబాద్ బ్లాక్ హాక్స్ (హెచ్‌బీహెచ్) జట్టు తన కొత్త జెర్సీని ఆవిష్కరించింది. బుధవారం హెచ్‌బీహెచ్ జట్టు యజమాని కంకణాల అభిషేక్, ఆ టీమ్ కెప్టెన్ పాలో యూరీ లామోనియర్ జెర్సీని ఆవిష్కరించారు. తెలంగాణ సంప్రదాయానికి ప్రాధాన్యత ఇస్తూ పోచంపల్లి చేనేత వస్త్రకారులు తయారు చేసే ఇక్కత్ ఫ్యాబ్రిక్ ప్రేరణతో మన సంస్కృతి ప్రతిబింబించేలా హైదరాబాద్ జట్టు జెర్సీను తయారు చేయడం విశేషం. గురువారం నుంచి మొదలవుతున్న ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో పోటీ పడుతున్న హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టుకు రెండు తెలుగు రాష్ట్రాల్లోని వాలీబాల్ అభిమానులు తమ మద్దతు ఇచ్చి ప్రోత్సహించాలని కోరారు.

# వాలీబాల్ పండుగకు వేళాయె

## నేటి నుంచి ప్రైమ్ వాలీబాల్ లీగ్

## ఆరంభ పోరులో కాలికట్‌తో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ ఢీ

**హైదరాబాద్:**
వాలీబాల్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) నాలుగో సీజన్‌కు రంగం సిద్ధమైంది. పది జట్లు బరిలో నిలిచిన ఈ మెగా లీగ్ హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం వేదికగా గురువారం నుంచి సందడి చేయనుంది. తొలి రోజు ఆతిథ్య హైదరాబాద్ బ్లాక్ హాక్స్, డిఫెండింగ్ చాంపియన్ కాలికట్ హీరోస్ జట్ల మధ్య జరగనున్న మ్యాచ్‌తో టోర్నమెంట్ ప్రారంభం కానుంది. సొంత గడ్డపై బరిలోకి దిగుతున్న హైదరాబాద్ బ్లాక్ హాక్స్‌కు బ్రెజిల్ ఆటగాడు పాలో లమౌనీర్ కెప్టెన్‌గా వ్యవహరిస్తుండగా, పటిష్టమైన కాలికట్ హీరోస్‌కు అనుభవజ్ఞుడైన మోహన్ ఉక్రపాండియన్ నాయకత్వం వహిస్తున్నాడు.




బుధవారం హైదరాబాద్‌లో నిర్వాహకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లీగ్ సహ–వ్యవస్థాపకుడు బేస్‌లైన్ వెంచర్స్ సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ తుహిన్ మిశ్రా, లీగ్ సీఈఓ జాయ్ భట్టాచార్య, టైటిల్ స్పాన్సర్ – ఆర్ఆర్ కేబుల్ గ్లోబల్ డైరెక్టర్ కీర్తి కాబ్రా, ఆర్ఆర్ కేబుల్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ శిశిర్ శర్మ, స్కాపియా వ్యవస్థాపకుడు అనిల్ గోటేటి తో పాటు పది ఫ్రాంచైజీల కెప్టెన్లు హాజరయ్యారు.

Truth of News
RNI NO : APTEL/25/A0239
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in



# ఏటా డీఎస్సీ నిర్వహిస్తాం

## రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత





పెనుకొండ, సూర్య వాస్తవం, అక్టోబర్ 1:కూటమి ప్రభుత్వం ఏటా డీఎస్సీ నిర్వహించాలని నిర్ణయించిందని, బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తాము కూడా ఏటా ఉచిత డీఎస్సీ శిక్షణ ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. డీఎస్సీ అంటేనే టీడీపీ అని, టీడీపీ అంటేనే డీఎస్సీ అని వెల్లడించారు. ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తామంటూ జగన్ నిరుద్యోగయువతను అయిదేళ్లపాటు దగా చేశారని మండిపడ్డారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఇటీవల మెగా డీఎస్సీలో పెనుకొండ నియోజక వర్గం నుంచి టీచర్ పోస్టులు సాధించిన 70 మంది అభ్యర్థులకు మంత్రి సవిత బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, 2025 మెగా డీఎస్సీలో టీచర్ పోస్టులు సాధించిన 15,941 మంది అభ్యర్థులకు ఇటీవల సీఎం చంద్రబాబు నియామక పత్రాలు అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టినప్పుడు తన తొలి సంతకం మెగా డీఎస్సీ నిర్వహణ ఫైల్ పై పెట్టిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. కేవలం 150 రోజుల్లో డీఎస్సీ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేసిన ఘనత మంత్రి నారా లోకేష్ దేనన్నారు. మెగా డీఎస్సీని అడ్డుకోడానికి వైసీపీ నాయకులు 105కు పైగా కోర్టుల్లో కేసులు వేశారన్నారు. వాటన్నింటినీ అధిగమించి డీఎస్సీ నిర్వహించిన ఘనత లోకేశ్ దేన్నారు. సీఎం చంద్రబాబు ప్రభుత్వంలో 15 ఏళ్లలో 14 సార్లు డీఎస్సీని నిర్వహించి, 1,96,619 టీచర్ ఉద్యోగాలిచ్చారన్నారు. అందుకే డీఎస్సీ అంటేనే టీడీపీ... టీడీపీ అంటేనే డీఎస్సీ అని అన్నారు. ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీ కోసం బీసీ అభ్యర్థులకు ఆన్ లైన్, ఆఫ్ లైన్ ద్వారా ఆరు వేల మందికి ఉచిత శిక్షణ అందజేశామన్నారు. వారిలో 270 మంది టీచర్ ఉద్యోగాలు సాధించడంపై మంత్రి సవిత ఆనందం వ్యక్తంచేశారు.

**ఇకపై ఏటా డీఎస్సీ నోటిఫికేషన్..**

ఇకపై ఏటా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారని మంత్రి సవిత తెలిపారు. బీసీ అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా ఏటా ఉచిత డీఎస్సీ కోచింగ్ ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. అత్యధిక బీసీ అభ్యర్థులు టీచర్, ఇతర ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు.

**నిరుద్యోగులకు జగన్ దగా...**

మెగా డీఎస్సీ నిర్వహించడం ద్వారా బాబుతోనే జాబు అనే నిరుద్యోగుల భావనను నిజం చేశామని మంత్రి సవిత వెల్లడించారు. నిరుద్యోగుల నమ్మకాన్ని నిలబెట్టుకున్నామన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్ అంటూ జగన్ రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువతను తీవ్రంగా మోసం చేశాడన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్ అనడంతో నిజమేనని నమ్మిన నిరుద్యోగ యువకులు కోచింగ్ సెంటర్లకు వేలకు వేలు ఫీజులు చెల్లించి శిక్షణ పొందారన్నారు. అయిదేళ్లలో ఏనాడూ డీఎస్సీగాని, ఇతర పోటీ పరీక్షలుగాని నిర్వహించకుండా నిరుద్యోగులను జగన్ తీవ్ర నిరాశకు గురిచేశాడన్నారు. ఈ కార్యక్రమంలో నూతన టీచర్లతో పాటు వారి బంధువులు, తల్లిదండ్రులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో ఆయుధ పూజ

## జిల్లా ప్రజలు సుఖశాంతులతో జీవించేలా ఆశీర్వదించాలని దుర్గామాతను ప్రార్థించిన జిల్లా ఎస్పీ





అనంతపురం క్రైం, సూర్య వాస్తవం, అక్టోబర్ 1: అనంతపురం జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ లో దసరా పర్వదినం పురస్కరించుకుని పోలీసులు వినియోగించే ఆయుధాలకు మరియు వాహనాలకు బుధవారం ఆయుధ పూజ ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఈ పూజా కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా పోలీసు ఆయుధగారం ఆవరణలో దుర్గామాత చిత్రపటాన్ని మరియు అన్ని రకాల తుపాకులను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కర్పూర హారతి ఇచ్చి జిల్లా ప్రజలు సుఖశాంతులతో జీవించేలా ఆశీర్వదించాలని దుర్గామాత చిత్ర పటాన్ని ప్రార్థించారు. అన ఓంతరం మోటారు ట్రాన్సుపోర్టు విభాగానికెళ్లి పోలీసులు నిత్యం వినియోగించే ద్విచక్ర వాహనాలు, కార్లతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు మరియు అల్లరి మూకలను చెదరగొట్టేందుకు ఉపయోగించే వాటర్ కేనన్.. మందు పాతరలు నిర్వీరం చేసే వజ్ర వాహనాలకు ఎస్పీ పూజలు చేశారు. అనంతరం పొడగించిన సబ్సిడరీ క్యాంటీన్ భవనాన్ని ప్రారంభించి ఆయుధ పూజ చేశారు. ఆతర్వాత డిపిఓ ముందు ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన ఫిరంగి వద్ద మరియు పోలీస్ పెట్రోల్ బంకులలో నిర్వహించిన ఆయుధ పూజ కార్యక్రమాలలో పాల్గొన్నారు. జిల్లా ఎస్పీతోపాటు ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, అనంతపురం అర్బన్, రూరల్ డీఎస్పీలు వి.శ్రీనివాసరావు, వెంకటేశులు, ఏ.ఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, సిఐలు ధరణీ కిశోర్ , క్రాంతికుమార్, జగదీష్, శ్రీకాంత్ , శాంతిలాల్ , వలీబాషా, జయపాల్ రెడ్డి, ఆర్ఐలు పవన్‌కుమార్, మధు, సూపరింటెండెంట్ ప్రసాద్ , పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్ , జాఫర్, గాండ్ల హరినాథ్, లక్ష్మినారాయణ, తదితరులు పాల్గొన్నారు.



## భూగర్భ జలాలు పెంచేందుకు
# చర్యలు తీసుకోవాలి

- నీటి సంరక్షణ సంఘాలను ఏర్పాటు చేయాలి
- ఇరిగేషన్ ట్యాంకులన్నీ నీటితో నింపాలి
- జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్



పుట్టపర్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 1: జిల్లాలో ఒక సంవత్సరంలో గా అన్ని చెరువులలో, నీటి ట్యాంకులలో శాశ్వతంగా నీరు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను జిల్లా కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్ ఆదేశించారు,బుధవారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఇరిగేషన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ మాట్లాడుతూజిల్లాలో ఉన్న అన్ని ఇరిగేషన్ ట్యాంకులలో నీటిని నింపేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. నీరు వృధా కాకుండా నీటి సంరక్షణ పనులను చేపట్టాలని అన్నారు. ఒక సంవత్సరంకాలంలోగా జిల్లాలోఉన్న అన్నిచెరువులు, నీటి ట్యాంకులలో శాశ్వతంగా నీరు ఉండేలా ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఫారం పాండ్లను నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. వ్యవసాయ విస్తరణను పెంచాలన్నారు. వ్యవసాయ పంటలపై శ్రద్ధ చూపాలని అన్నారు. మండల స్థాయిలో నీటి సంరక్షణ సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం నీటి నిల్వలు ఎంత ఉండేది, ఎంత మేర నీతిని ఖర్చు చేసేది, పంటలకు ఎంత నీటిఅవసరం తదితరవివరాలను తెలపాలని సంబంధిత అధికారులను ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో చిన్న నీటిపారుదల శాఖ ఈ ఈ గురుమూర్తి, డి ఈ గంగాద్రి, ఏఈ షబానా, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఇంచార్జ్ పిడి శ్రీలక్ష్మి, హంద్రీనీవా సుజల స్రవంతి ఎస్ ఈ రాజా స్వరూప్, డి ఈ మురళి తదితరులు పాల్గొన్నారు.



# ఈ కామర్స్ సంస్థలపై నిఘా




ముంబై, సూర్య వాస్తవం, అక్టోబర్ 1: ప్రభుత్వం ఇప్పుడు షాంపూ, పప్పులు, వెన్న, టూత్‌పేస్ట్ వంటి రోజువారీ వస్తువుల ధరలను నిశితంగా పరిశీలిస్తోంది. దీని కోసం, ఇ-కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లను కూడా పరిశీలన పరిధిలోకి తీసుకువచ్చారు. జీఎస్టీ రేట్లలో కోత ప్రయోజనం వినియోగదారులకు పూర్తిగా, సరిగ్గా చేరేలా చూడడమే దీని లక్ష్యం. ఇటీవల అమలు చేసిన ఊు కోత తర్వాత, దాదాపు 99% రోజువారీ వస్తువుల ధరలు తగ్గాలి. కొన్ని ఇ-కామర్స్ కంపెనీలు వినియోగదారులకు పూర్తి ప్రయోజనం చేకూర్చడం లేదని ఫిర్యాదులు వచ్చాయి. ప్రభుత్వం అనధికారికంగా అనేక ఇ-కామర్స్ ఆపరేటర్లకు ధరలలో పారదర్శకతను తీసుకురావాలని హెచ్చరించింది.ఆర్థికమంత్రిత్వ శాఖ సెంట్రల్ ఊు అధికారులను 54 సాధారణ వస్తువుల ధరలపై నెలవారీ నివేదికలను సమర్పించాలని ఆదేశించింది. మొదటి నివేదికను మంగళవారం నాటికి సెంట్రల్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ బోర్డ్)కి సమర్పించాల్సి ఉంది. జాబితా చేసిన వస్తువులలో షాంపూ, టూత్‌పేస్ట్, వెన్న, టొమాటో కెచప్, జామ్, ఐస్‌క్రీం, ఏసీ , టీవీ, సిమెంట్, డయాగ్నస్టిక్ కిట్‌లు, థర్మామీటర్లు, క్రేయాన్‌లు మొదలైనవి ఉన్నాయి.అనేక ఇ-కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లు ఊు కోత తర్వాత ధరలలోని వ్యత్యాసాలను “సాంకేతిక లోపం” అని పేర్కొన్నాయి. అదే సమయంలో కొన్ని కంపెనీలు స్వయంగా ముందుకు వచ్చి వినియోగదారులకు ధరలను తగ్గించడం ద్వారా ప్రయోజనం చేకూరుస్తున్నామని పేర్కొన్నాయి. ఊు కోత ప్రత్యక్ష ప్రయోజనం సామాన్య ప్రజలకు అందేలా ప్రభుత్వం “లాభార్జన వ్యతిరేక వ్యవస్థ” బలహీనంగా ఉన్నప్పటికీ ఇ-కామర్స్ ఆపరేటర్లపై నిఘా ఉంచింది.ప్రభుత్వం కఠినమైన నిఘా ప్రభావం వినియోగదారులపైనే కాకుండా ఇ-కామర్స్ కంపెనీల షేర్లు, పెట్టుబడిదారులపై కూడా అనుభవించవచ్చు. ఇ-కామర్స్ కంపెనీలపై పెరుగుతున్న నిఘా, ధరల కోత ఒత్తిడి వారి లాభాలను ప్రభావితం చేయవచ్చు. పెట్టుబడిదారులలో అనుమానం కారణంగా, స్టాక్‌లలో స్వల్పకాలిక హెచ్చుతగ్గులు ఉండవచ్చు. కంపెనీలు ధరలను పెంచలేకపోతే లేదా ఊు కోత పూర్తి ప్రయోజనాన్ని వినియోగదారులకు అందించవలసి వస్తే, లాభాల మార్జిన్ తగ్గవచ్చు. దీర్ఘకాలంలో కంపెనీ ఆర్థిక ఆరోగ్యంపై ప్రభావం పడవచ్చు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, GSTIN : 37AAJF15233N1ZY, TEL: 7672042522.VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 (FOUNDER -N.ARIF ALI )